# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 28-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:231 పేజీలు:6 వెల: రూ.1/-


## కవిత బెయిల్ పిటిషన్ మే 28కి వాయిదా

న్యూఢిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లిక్కర్ స్కామ్ కేసులో కవిత బెయిల్ పిటిషన్ రేపటికి (మే 28కి) వాయిదా పడింది. న్యాయమూర్తి స్వర్ణకాంత్ శర్మ విచారణ చేపట్టనున్నారు. సిబిఐ, ఈడి దాఖలు చేసిన కేసుల్లో బెయిల్ పిటిషన్లపై రేపు విచారణ జరుగనున్నది. దర్యాప్తు సంస్థలు కవిత అరెస్టులో చట్టాన్ని ఉల్లంఘించాయని ఆరోపించారు. సిబిఐ రేపు కూడా వాదనలు వినిపించనున్నది. ఇప్పటికే సిబిఐ, ఈడి కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయి. కాగా విచారణ రేపు మధ్యాహ్నానికి వాయిదా పడింది.కవిత తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి పలు కీలక విషయాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కవితపై చర్యలు తీసుకోబోమంటూ మొదట్లో ఈడి సుప్రీంకోర్టుకు అండర్ టేకింగ్ ఇచ్చిందని, కవిత వేసిన రిట్ పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉండగానే ఈడి సుప్రీంకోర్టుకు లేఖ రాసిందిని తెలిపారు.కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉండగానే ఆమెను ప్రశ్నించాలంటూ సిబిఐ పిటిషన్ వేసిందన్నారు. పిటిషన్ ను కోర్టు అంగీకరించగా, కవితకు మాత్రం సమాచారం ఇవ్వలేదన్నారు. కనీసం అరెస్టు వారెంటు కూడా లేకుండానే సిబిఐ కవితను అరెస్టు చేసిందని వివరించారు. కాగా రేపు కౌంటర్ వాదనలు వినిపించనున్నట్లు ఈడి కోర్టుకు తెలిపింది

### చురక

ఎన్నికల్లో ఈసి తీరు
ఎక్కడుంది తటస్థం
అధికారంలునోళ్లకే
అనుకూలం సమస్తం.

విచ్చలవిడి అధినేతల
విద్వేషపు ప్రసంగాలు
కట్టడి చేయాల్సి ఉన్నా
కలెదిరిగె విహంగాలు



-వేల్పుల
నారాయణ

## వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు : సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్, మే 27 :జూన్ 2న రాష్ట్ర అవతరణ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. తెలంగాణ అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సచివాలయంలో వివిధ శాఖల కార్యర్శులు, ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు సీఎం నివాళులు అర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించడంతో పాటు, సందేశం ఉంటుందని తెలిపారు.

సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్యాంక్ బండ్‌పై రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్టు చెప్పారు. దాంతో పాటు శిక్షణ పొందుతున్న 5వేల మంది పోలీస్ అధికారులు బ్యాండ్‌తో ఈ ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేసి హస్తకళలు, చేనేత, స్వయం సహాయక బృందాలతో తయారు చేసిన పలు వస్తువులతో పాటు నగరంలోని పేరొందిన హోటల్స్‌తో ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యే నగరపౌరులతో వచ్చే పిల్లలకు పలు క్రీడలతో కూడిన వినోదశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్యాంక్ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన తోపాటు లేజర్ షో ఏర్పాటు చేశామని శాంతి కుమారి చెప్పారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నగర పోలీస్ అడిషనల్ కమిషనర్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఎన్‌పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్, హెచ్ ఎండీఏ అడిషనల్ కమిషనర్ ఆమ్రపాలి కాటా పాల్గొన్నారు.

## హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోము: సుప్రీంకోర్టు

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఈ నెల ప్రారంభంలో బిజెపి తృణమూల్ కాంగ్రెస్‌ను అవినీతిపరులుగా , హిందువులకు వ్యతిరేకమైనదిగా చిత్రీకరిస్తూ కనీసం 4 దినపత్రికలలో ప్రకటనలు ప్రచురించింది.లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఎలాంటి ప్రకటనలను ప్రచురించకూడదని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన కలకత్తా హైకోర్టు ఆదేశాలపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు జెకె. మహేశ్వరి, కెవి. విశ్వనాథన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ నిరాకరించింది. "ప్రాథమిక సాక్ష్యాధారాల (ప్రైమా ఫేసీ) దృష్ట్యా ప్రకటన అవమానకరమైనది" అని బెంచ్ పేర్కొంది.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రాజకీయ పార్టీలు, నాయకులు , అభ్యర్థులు ధృవీకరించని ఆరోపణల ఆధారంగా తమ ప్రత్యర్థులను విమర్శించడాన్ని నిషేధిస్తుంది.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు కొత్త లుక్.. సీఎం రేవంత్

### -కార్పొరేట్ తరహాలో నిర్మాణం
### -అధునాతనమైన భవనాలు
### -పరిసరాలు ఆహ్లాదంగా ఉండేలా తీర్చిదిద్దాలి
### -మోడల్‌గా ఉండాలని సీఎం రేవంత్ నిర్ణయం

హైదరాబాద్, మే 27 :రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు కూర్చోడానికి కుర్చీలు లేకుండా.. చెట్ల కింద, నీడ దొరికిన చోట నిరీక్షించే పరిస్థితి ఇకపై ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో అన్నారు. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సోమవారం అధికారులతో జరిగిన సమీక్షలో ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. ఆదిలాబాద్ లో బోథ్, మేడ్చల్ జిల్లా షామీర్? పేట సబ్? రిజిస్ట్రార్ ఆఫీసులు ఎన్నికల కోడ్ తర్వాత ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

అద్దె భవనాల్లో 104 ఆఫీసులు..

ఇక.. మిగతా 104 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52చోట్ల ఆఫీసులకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కూడా కేటాయించారు. భూములు రెడీగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషించాలని,



పబ్లిక్ యుటిలిటీ కింద సేకరించిన స్థలాలు అందుబాటులో ఉంటే.. అక్కడే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కాగా, మొదటి దశలో ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు.

#### పరిసరాలు ఆహ్లాదంగా ఉండేలా..

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే క్రయ విక్రయదారులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసేంత సేపు మంచి ఆతిథ్యమిచ్చే, ఆహ్లాదంగా ఉండే కార్పొరేట్ లుక్, వెయిటింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్, కెఫేటేరియా లాంటి అన్ని సదుపాయాలుండాలని, అవన్నీ ఉండేలా అధునాతన నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే చోట సిబ్బంది కొరత లేకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాల ఆఫీసుల నుంచి ఎక్కువ పని ఉన్న చోటికి సిబ్బందిని సర్దుబాటు చేయాలని ఆదేశించారు.

#### టీజీ లోగో పై రుద్ర రాజేష్ తో రేవంత్ చర్చలు..

తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంపై చిత్రకారులు రుద్ర రాజేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పలు నమూనాలను పరిశీలించారు. తుది నమూనాపై సీఎం పలు సూచనలు చేశారు. ఇప్పటికే తెలంగాణ కోడ్ టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చారు. టీఎస్ స్థానంలో టీజీని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇతర అధికారిక కమ్యూనికేషన్‌లు కూడా టీఎస్‌కు బదులుగా తెలంగాణ కోడ్‌ను టీజీగా ఉపయోగిస్తున్నాయి. లెటర్‌హెడ్‌ల నివేదికలు, నోటిఫికేషన్‌లు, అధికారిక వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ బయోస్, ఇతర అధికారిక వెబ్‌సైట్‌లు ఆన్‌లైన్ బయోస్‌లో టీజీ గా మార్చేశారు.

## యాథాతథంగా గ్రూప్ వన్ పరీక్ష...తేదీలలో మార్పు లేదు

హైదరాబాద్, మే 27 :తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేసే ప్రసక్తే లేదని టీఎస్ పీఎస్సీ తేల్చి చెప్పింది. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. జూన్ 9న పరీక్ష నిర్వహించేందుకు జూన్ 1 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదలైన వెంటనే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన [illegible] ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎన్నికలు వచ్చాయి. దీంతో గ్రూప్-1కి దరఖాస్తు చేసుకున్న వారిలో నిరుద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఇన్ సర్వీస్ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో తప్పనిసరిగా పాల్గొనాల్సి వచ్చిందని, నిరుద్యోగులదీ అదే పరిస్థితి ఎదుర్కొన్నారన్నారు.

ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల వాయిదా

ఎన్నికల నేపథ్యంలో పరీక్షలకు సిద్ధం కాలేదని, గ్రూప్-1 అభ్యర్థులు కనీసం రెండు నెలలపాటు ప్రిలిమినరీ పరీక్షలను వాయిదా వేసి తమకు న్యాయం చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే పరీక్షలు వాయిదాకు తిరస్కరించింది.

536 పోస్ట్ లకు పరీక్షలు..

మరోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ విభాగాల్లో మొత్తం 536 ఖాళీల కోసం గ్రూప్ 1 స్థానాలకు రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష 9 జూన్ 2024న రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేంద్రాలలో జరగనుంది, పరీక్ష వ్యవధి మూడు గంటలు ఉంటుంది. తమ దరఖాస్తు ఫారమ్‌ను విజయవంతంగా సమర్పించిన అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరు కావచ్చు. దరఖాస్తు ఫారమ్‌ను విజయవంతంగా సమర్పించిన అభ్యర్థులు తమ గ్రూప్ 1 హాల్ టిక్కెట్‌ను పరీక్ష తేదీకి ముందు అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు ఈ హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసి, పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లాలి, ఎందుకంటే ఇది పరీక్షకు కూర్చోవడానికి వారి అర్హతను ధృవీకరిస్తుంది.

## మరో వారం రోజుల పాటు గడువును పెంచండి

### -సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరో వారం రోజుల పాటు జూన్ 7 వరకు తన మధ్యంతర బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. అనారోగ్య కారణాల దృష్ట్యా వైద్య పరీక్షల కోసం కేజ్రీవాల్ గడువు కోరినట్లు తెలుస్తోంది.బరువు తగ్గడం, కీటోన్ లెవెల్స్ పెరగడంతో పెట్ సిట్ స్కాన్ చేయించుకోవాల్సి ఉందని ఆయన పిటిషన్ లో తెలిపారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్ కేసులో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయగా, జూన్ 1వరకు ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

## హాఫీజ్‌పేట్‌లో సమద్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

హైదరాబాద్, మే 27 : నిన్న హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసిన సంగతి తెలిసందే. ఈదురు గాలుల బీభత్సానికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి. రేకుల షెడ్లు ఎగిరిగిపోయాయి. అయితే మియాపూర్ పరిధిలోని హాఫీజ్‌పేటలోని సాయి నగర్‌లో భారీ గాలులకు ఓ రేకుల ఇల్లులో ప్రమాదం జరిగింది. పక్కనున్న ఇంటి నుంచి ఇటుకలు ఎగిరిపడడంతో రేకులు పగిలిపోయాయి. ఇటుకలు ఇంట్లో ఉన్న నాలుగేండ్ల బాలుడు సమద్‌పై పడిపోయాయి. దీంతో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

ఈ క్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సమద్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సమద్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు కేటీఆర్. గాలి వానలకు జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ స్థానికులకు సూచించారు.

## గన్నవరం హైవేపై వేగంగా దూసుకొచ్చి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

### -ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



గన్నవరం మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆంధ్రప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కృష్ణా జిల్లా గన్నవరం హైవేపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. తిరుపతి నుంచి బెంగళూరు వెళుండగా.. బాపులపాడు మండలం కోడూరుపాడు దగ్గర ఈ ప్రమాదం జరిగింది. మృతులు నెల్లూరుకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అదానీ, అంబానీల కోసం 24 గంటలు కష్టపడుతున్న మోదీ : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 27 : లోక్‌సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ప్రచారం క్లైమాక్స్‌కు చేరింది. బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఓ ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో 22 మందిని ప్రధాని మోదీ రాజులు, మహారాజులుగా చేశారని కానీ వారి పేర్లు మాత్రం వేరని అన్నారు.

వారిలో అదానీ, అంబానీల పేర్లున్నాయని వారి కోసం నరేంద్ర మోదీ 24 గంటలు కష్టపడతారని ఎద్దేవా చేశారు. బిలియనీర్లను బాగు చేసేందుకు ప్రధాని అహరహం శ్రమిస్తున్నారని ఆరోపించారు.

పేదల సమస్యలు, ధరల మంట, నిరుద్యోగం గురించి కాషాయ పాలకులు పట్టించుకోరని విమర్శించారు.దేశ సంపదను బడా సంపన్నులకు దోచిపెడుతున్నారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. పెద్ద పెద్ద కథలు చెప్పడం మాని అసలు దేశంలో ఎంతమంది యువతకు ఉద్యోగాలిచ్చారో ప్రధాని మోదీ బిహార్ యువతకు చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యర్థ ప్రసంగాలు, దేశ ప్రజల మధ్య చీలిక చిచ్చును నిలిపివేయాలని మోదీకి హితవు పలికారు.




## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తాం

బీహార్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రతిపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రక్షణ సర్వీసులలో నియామకాలకు సంబంధించిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తుందని, ప్రతి పేద మహిళ ఖాతాలో నెలకు రూ. 8,500 డిపాజిట్ చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. బీహార్‌లోని బక్తియాంపూర్ సోమవారం ఒక ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా ఇండియా కూలమికి అనుకూలమైన వాతావరణం స్పష్టంగా కనిపిస్తున్న కారణంగా ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి అధికారంలోకి వచ్చే ప్రసక్తి లేదని జోస్యం చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరిస్తుందని ఆయన తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జులై నుంచి మహిళల బ్యాంకు ఖాతాలో ప్రతి నెల రూ. 8,500 డిపాజిట్ చేస్తామని ఆయన చెప్పారు. దీని వల్ల ప్రతి కుటుంబం ఆర్థిక పరిస్థితిలో గణనీయమైన మార్పు వస్తుందని ఆయన తెలిపారు. తనను దేవుడే పంపించాడంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ జూన్ 4 తర్వాత అవినీతి గురించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నిస్తే తనకు ఏమీ తెలియదని, తనను దేవుడు పంపించాడని నరేంద్ర మోడీ సమాధానమిస్తారని ఎద్దేవా చేశారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ విద్యార్థిని మృతి

హైదరాబాద్, మే 27 :అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మరో యువతి దుర్మరణం పాలైంది. వివరాల్లోకి వెళితే యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లికి చెందిన గుంటిపల్లి సౌమ్య (25) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది.

అక్కడ అట్లాంటిక్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. సౌమ్య చదువుతోపాటు పార్ట్‌టైమ్ జాబ్ కూడా చేస్తోంది. అయితే, ఆదివారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఆమెను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది.

ఈ ప్రమాదంలో యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సౌమ్య మృతి చెందిన సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో యాదగిరిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సౌమ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అమెరికాలోని తెలుగు సంఘాలు, భరతరాయభార సంస్థలు ఏర్పాట్లు చేశారు.

## భార్యకు తెలిసిన ప్రియురాలి వ్యవహారం.. ఆమె ప్లాన్‌తో హత్య చేసిన వ్యక్తి

జైపూర్, మే 27 : ఒక వ్యక్తికి ప్రియురాలితో ఉన్న సంబంధం గురించి అతడి భార్యకు తెలిసింది. దీంతో ఆమె ప్లాన్ మేరకు ఆ మహిళను అతడు హత్య చేశాడు. దీనికి ముందు ఆమె కుమారుడ్ని కూడా దారుణంగా చంపాడు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దేవిలాల్ పర్మార్ అనే వ్యక్తికి సీత అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలిసిన ఆమె భర్త తన కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో నాలుగేళ్ల కుమారుడు ఆ మహిళతో ఉన్నాడు.

కాగా, వివాహితుడైన దేవిలాల్‌కు ముగ్గురు సంతానం. అయితే సీతతో ఉన్న సంబంధం గురించి అతడి భార్యకు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆమె హత్యకు ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో బంధువుల ఇంటికని చెప్పిన దేవిలాల్, సీతను బైక్‌పై తీసుకెళ్లాడు. మార్గమధ్యలో వారిద్దరూ మద్యం తాగారు. ఒక చోట విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా కత్తితో గొంతు కోసి సీతను హత్య చేశాడు. ఆమె చేతిపై తన పేరు పచ్చబొట్టు ఉండటంతో అక్కడి చర్మాన్ని కత్తితో కోశాడు.మరోవైపు అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తు చేసిన పోలీసులు 39 రోజుల తర్వాత సీత హత్య గుట్టును రట్టు చేశారు. కీలక సమాచారం ఆధారంగా దేవీలాల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సీతను తానే హత్య చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. అలాగే ఏడాది కిందట ఆమె నాలుగేళ్ల కుమారుడి తలపై కొట్టి చంపినట్లు చెప్పాడు.

## రఫాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు.. 35 మంది పాలస్తీనియన్లు మృతి

న్యూఢిల్లీ, మే 27 : దక్షిణ గాజా నగరమైన రఫా పై సైనిక దాడులను వెంటనే నిలిపివేయాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) ఆదేశాలను ఇజ్రాయెల్‌బేఖాతరు చేసింది. రఫాపై దాడులను మరింత పెంచేసింది. నగరంలోని పలు లక్ష్యాలను బాంబులతో నాశనం చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ప్రణాళికలు చేపట్టింది. ఇందులో భాగంగానే రఫాపై ఆదివారం విరుచుకుపడింది.నివాసితులు ఉంటున్న గుడారాలపై వరుసగా బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 35 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తాజాగా వెల్లడించింది. డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు తెలిపింది. మృతుల్లో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపింది. మృతులు, గాయపడిన వారిని తీసుకెళ్లేందుకు రఫాలో సరిపడా సామర్థ్యం ఉన్న ఆసుపత్రులేవీ లేవని పేర్కొంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన ప్రాంతం వలసదారులతో కూడిన క్యాంప్ అని పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ వెల్లడించింది.

### నేటి కందం- నేటికీ అందం

విమలమ్మగ నుండెడి-లో
కమునకు వెలుగులను నింపి క్రమమును జూపన్
రమణీమణుల మహారో
గ్యముపై ధ్యానమ్ము నింపి కాపాడవలెన్

(మే 28 మహిళల ఆరోగ్యంపై శ్రద్ధను గూర్చి వివరించే అంతర్జాతీయ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# మహిళలకు 'రుతుస్రావ సెలవుల' హక్కు కల్పించలేమా !

**(28 మే "రుతుస్రావ ఆరోగ్య దినం" సందర్భంగా)**

దేశ కార్మిక చట్టాలు అనేక రకాలైన సెలవులకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉన్నప్పటికీ నేటికీ మహిళలకు అత్యవసరమైన 'రుతు స్రావ సెలవుల(మెనుస్ట్రువల్ లీవ్)' చట్టాలను చేయడంలో తటపటాయిస్తున్నట్లు విధితమవుతున్నది. లింగ అసమానతల సమాజంలో సహజ శారీరక సమస్య అయిన "బహిష్టులు లేదా పీరియడ్స్ లేదా రుతుస్రావాలను (మెనుస్ట్రువల్ సైకిల్)" మహిళలకు మాత్రమే కేటాయించడంతో పురుష సమాజానికి ఆ సమయంలో మహిళలు పడే మహా వేదనలు అర్థం కావడం లేదు. సాధారణంగా పీరియడ్స్ సమయంలో 3 నుంచి 5 రోజుల పాటు అధిక రక్తస్రావంతో పాటు తీవ్ర కడుపు నొప్పిని అనుభవిస్తూ ఉంటారు. పీరియడ్స్ వచ్చాయని మహిళలు బహిరంగంగా చెప్పడానికి ఇష్టపడరు, చెప్పినా సమాజం దానిని చులకన భావంతో చూస్తుందని కూడా మహిళా సమాజం భయపడడం జరుగుతోంది. సాధారణంగా రుతుస్రావ నొప్పిని కడుపు నొప్పిగా కప్పిపుచ్చడానికి లేదా మరో ఇతర అనారోగ్యమని చెప్పడానికి మహిళలు ఇష్టపడతారు. ఆధునిక స్త్రీ పురుష సమాజం రుతు ఆరోగ్యం పట్ల బహిరంగంగా చర్చించడానికి, వారి బాధలను అర్థం చేసుకోవడానికి ముందుకు రావాలి. బహిష్టు సమయ బాధలను మన ఇంట్లోనా మహిళలు కూడా అనుభవిస్తున్నప్పటికీ కార్యాలయాల్లో పని చేసే మహిళలు పడుతున్న బాధలను మాత్రం చులకనగా చేసి చూడడం, అమానవీయంగా ఎగతాళిగా ప్రవర్తించడం మానుకొని బహిష్టు కాలపు సెలవుల అవసరం గూర్చి చర్చించడం సత్వర అవసరంగా భావించాలి.

## రుతుక్రమ సమయంలో అనారోగ్యాలు:

రుతుక్రమ సెలవుల విధానాలను కొన్ని దేశాలు అమలు చేస్తున్నప్పటికీ భారత మహిళలకు ఈ సదుపాయం కల్పించడంలో పాలకుల దృష్టి పడడం లేదు. బహిష్టు సమయంలో విధులు నిర్వహించని మహిళలకు జీతంతో కూడిన లేదా జీతం చెల్లించని సెలవులుగా కొద్ది దేశాలు తమ చట్టాలను చేసి ముందుకు సాగుతున్నాయని, ఇలాంటి దేశాల నియమనిబంధనలను చూసి భారత ప్రభుత్వం కూడా అదే విధమైన చట్టాలను చేయాలని మహిళాలోకం కోరుకుంటున్నది. ప్రసూతి సెలవుల వలె రుతుస్రావ సమయ సెలవుల వెసులుబాటును కలిపించడం ద్వారా లింగ సమానత్వ సాధనకు మరో నవ్య అడుగుగా భావించాలి. రుతుస్రావ సమయంలో మహిళలకు 'డిస్మెనోరియా' అనబడే తీవ్ర నొప్పి కలుగుతుంది. అధిక శాతం మహిళలు పీరియడ్స్ సమయంలో ఏకాగ్రతను హరింపజేస్తూ, సాధారణ పని తీరుకు అంతరాయాలు కలిగిస్తూ, కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పీరియడ్స్ సమయంలో మహిళలు భావోద్వేగ, ప్రవర్తనపరమైన సమస్యలను (ఎమోషనల్ అండ్ బిహేవియరల్ సిండ్రోమ్) ఎదుర్కొంటున్నారు. రుతుస్రావ సమయాల్లో అధిక శాతం మహిళలు ఆందోళన, ఉద్రిక్తత, అణగారిన మానసిక స్థితులు, మూడ్ స్వింగ్, ఏకాగ్రత లోపం, సామాజిక ఉపసంహరణ, నిద్ర లేమి, కడుపు నొప్పి లాంటి అనారోగ్యాలను అనాదిగా అనుభవిస్తున్నారు. రుతుస్రావ సమయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించడానికి, సామాన్య మహిళలకు/బాలికలకు అవగాహన కల్పించడానికి 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున ప్రపంచ దేశాలు "రుతుస్రావ ఆరోగ్య దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. రుతుస్రావ ఆరోగ్య దినం-2024 నినాదంగా "రుతుస్రావ హిత ప్రపంచ నిర్మాణంలో ఏకమవుదాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

## రుతుక్రమ సెలవులు కల్పిస్తున్న దేశాలు:

2003లో ఐరాస ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సభ్య దేశాలకు సందేశమిస్తూ బహిష్టు సెలవులు మహిళల హక్కుగా భావించాలని సూచించింది. 2014 నుంచి ప్రతి ఏట 28 మే రోజున "ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినం" పాటించాలని డబ్ల్యూహెచ్ఓ అంగీకరించింది. 1912లోనే కేరళ రాష్ట్రంలోనే ఒక పాఠశాల విద్యార్థినులకు బహిష్టు సెలవులు మంజూరు చేయడం జరిగిందని గమనించాలి. రష్యాలో కూడా 1927కు పూర్వం రుతు స్రావ సెలవులను వర్తింపజేసినప్పటికీ 1927 తర్వాత తొలగించారు. జపాన్‌లో 1947లోనే స్త్రీలకు రుతుస్రావ సమయంలో పని రోజులుగా సెలవులను అనుమతించారు. పీరియడ్స్ కాలపు బాధలను నడవైద్యపరమైన సమస్యగా లేదా వివక్షాపూరిత చర్యగా చర్చలు కొనసాగుతున్నాయి. 2003 నుంచి ఇండోనేషియా నెలకు రెండు రోజుల బహిష్టు సెలవుల హక్కును కల్పించింది. దక్షిణ కొరియాలో రుతుక్రమ సెలవులకు అర్హత కల్పిస్తూ రుతుక్రమ సెలవులు తీసుకోనపుడు అదనపు వేతనం కూడా తెల్లిస్తున్నారు. తైవాన్, స్పెయిన్, ఇటలీ, జాంబియా లాంటి దేశాలు 1 నుంచి 3 రోజుల రుతుస్రావ సెలవులను అనుమతిస్తున్నాయి.

## భారతంలో రుతుస్రావ సెలవుల సమస్య:

బహిష్టు అనేది ఒక కళంక క్రియగా, మహిళలు ఆ సమయంలో అందరికీ దూరంగా, ఓ మూలన కూర్చోవాలనే అనారోగ్యకర సాంప్రదాయం, మూఢ నమ్మకాలు, సామాజిక కట్టుబాట్లు, మహిళల రుతుస్రావ వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన లేమి, బహిషుల సమస్యల పట్ల చిన్న చూపు నేటికీ కొనసాగడం అత్యంత విచారకరం. సువిశాల భారతంలో 35.5 కోట్ల మహిళలు రుతుస్రావ వయస్సులో ఉన్నారని, వీరిలో 75 శాతం మహిళలు నేటికీ అపరిశుభ్ర గుడ్డలను పీరియడ్స్ సమయంలో ఉపయోగిస్తున్నారని తెలుస్తున్నది. భారత్‌లో సహితం బహిష్టు సమస్య ఒక కళంకంగా భావించబడుతున్నది. రుతుస్రావ సమస్యలను తీసుకొని పురుషాధిక్య సమాజం మహిళాలోకాన్ని అబలుగా ముద్ర వేయడంతో లింగ వివక్ష మరింత పెరుగుతున్నట్లు తోస్తున్నది. నేటికీ భారతీయ మహిళలకు పీరియడ్స్ సమయ సెలవుల అవసరం గూర్చి సీరియస్‌గా చర్చించడం కూడా జరగడం లేదు. 1912లోనే కేరళ రాష్ట్రంలోని ఒక పాఠశాల విద్యార్థినులకు బహిష్టు సెలవులు మంజూరు చేయడం జరిగినప్పటికీ మెనుస్ట్రువల్ బెనిఫిట్స్ బిల్ ద్వారా రెండు రోజుల సెలవు మంజూరు చేయాలనే చట్టం తీసుకురావడంలో భారత ప్రభుత్వం నేటికీ సఫలం కాలేదు. 1992 నుంచి బీహార్ ప్రభుత్వం 2 రోజుల బహిష్టు సెలవుల హక్కును కల్పించింది. 2023లో కేరళ ప్రభుత్వం 18 ఏండ్లు దాటిన విద్యార్థులకు బహిష్టు సెలవుల వెసులుబాటు కల్పించారు. గోజూప్ అండ్ కలిచర్ మెషిన్, స్విగ్గీ, బైజూస్, జోమెటో లాంటి ప్రైవేట్ కంపెనీలు బహిష్టు సెలవులను పరిమిత రోజులు అనుమతించడం హర్షదాయకం.

## 2024 సాధారణ ఎన్నికల మానిఫెస్టోలు:

2024 సాధారణ ఎన్నికల్లో తమిళనాడు డిఎంకే పార్టీ రుతుస్రావ సెలవుల సమస్యను కేంద్రం దృష్టి తెస్తామని తమ మానిఫెస్టోలో పొందుపరచడం చూస్తున్నాం. 2017, 2021ల్లో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన రుతుస్రావ సెలవుల ప్రైవేట్ బిల్లులు చర్చలకు మాత్రమే పరిమితం అయ్యింది. డిసెంబరు 2023 వరకు ఇలాంటి బిల్ తీసుకురావడానికి ప్రభుత్వం వెనుకడుగు వేసింది. నేటి 2025 సాధారణ ఎన్నికల మానిఫెస్టోల్లో భాజపా 'సంకల్ప పత్ర్'లోగాని, కాంగ్రెస్ 'న్యాయ పత్ర్'లోగాని మహిళల బహిష్టు సెలవుల ప్రత్యేక ప్రస్తావణలు లేకపోవడం చూస్తున్నాం.

బహిష్టు సమయంలో వృత్తి ఉద్యోగాల్లో ఏకాగ్రత కొరవడడం, ఆ సమస్య పట్ల బహిరంగంగా మాట్లాడడం, కార్యాలయాల్లో మహిళలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయడం కనీస అవసరంగా భావించాలి. పరిశుభ్రమైన మహిళల మూత్రశాలలు, సానిటరీ న్యాప్‌కిన్స్/ప్యాడ్స్ ఏర్పాటు చేయడం, పనిలో కొంత వెసులుబాటు లేదా వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయడం, బహిష్టు సెలవులు మహిళల హక్కుగా భావించడం లాంటి సంస్కరణలు తీసుకురావాలని లింగ సమానత్వ సాధన పోరాట యోధులు కోరుకుంటున్నారు. రుతుస్రావ సమస్యలను బహిరంగంగా చర్చించడానికి మౌనాన్ని విడనాడడం తక్షణ కర్తవ్యమని ఏకరువు పెడుతూ మహిళా సమాజానికి అవసర ధైర్యాన్ని నూరిపోద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# హాజ్‌యాత్రకు బయలుదేరిన తొలిబృందం



అమరావతి, మే 27 :ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్-2024 యాత్ర నేడు బయలుదేరారు.. రాష్ట్రం నుంచి ఈ ఏడాది 2, 580 మంది హాజీల పవిత్ర యాత్రకు ఎంపికయ్యారు.. వారిలో322 మందితో కూడిన తొలి జట్టు నేటి ఉదయం ఉదయం 8 : 45 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలు దేరారు.. మొదటి విమానంలో ప్రయాణించే 322 మంది హజ్ క్యాంపు నుంచి ఉదయం 3. 30 గంటలకే గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకునున్నారు.

కాగా, హజ్ యాత్రకు వెళ్లే వారి సౌకర్యం కోసం గన్నవరం సమీపం లోని కేసరపల్లి ఈద్గా జామా మసీదు దగ్గర మదర్సాలోని హజ్ వసతి క్యాంపులో ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి హజ్ క్యాంపు వద్దకు చేరుకున్న తొలి బృందానికి వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. 24 గంటలు పనిచేసేలా మదర్సా దగ్గర మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించేలా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. మదర్సా వద్ద పరిశుభ్రమైన వాతావరణంలో టెంట్లు, ఎయిర్ కూలర్లు సిద్ధం చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నాట్లు ప్రకటించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాలలో నలుమూలల నుంచి 2580 మంది ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా హజ్ యాత్రకు పేర్లు నమోదు చేసుకోగా, మొదటి విడతలో భాగంగా ఈరోజు 322 మంది గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.. తొలిజట్టు సభ్యులతో కూడిన బస్సులను పవిత్ర హజ్ యాత్రను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి, చైర్మన్ హజ్ ఆపరేషన్స్ హర్షవర్ధన్ సోమవారం తెల్లవారుజామున గన్నవరం ఈద్గా జామా మసీదు హజ్ క్యాంపు నుండి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. వక్ఫ్ బోర్డు సీఈవో , హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్ మరియు హజ్ కమిటీ సభ్యులు సి ఆర్ డి ఏ అదనపు కమిషనర్ అలీం భాష, దూదేకుల కార్పొరేషన్ ఎండి గౌస్ పీర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్వలి తదితరులు హజ్ యాత్రికులకు అభినందనలు తెలిపారు.

# ఏసీబీ వలలో ఏవో వంశీకృష్ణ..

ఆదిలాబాద్, మే 27 : ఫర్టిలైజర్ షాపు రెన్యువల్ లైసెన్స్ కోసం రూ.38 వేలు లంచం తీసుకుంటూ దహేగాం మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఆసిఫాబాద్ కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ డివిజన్ దహేగాం మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న వంశీకృష్ణ ఫర్టిలైజర్ షాప్ యజమాని శ్యామ్ రావు నుండి రెన్యువల్ లైసెన్స్ కోసం రూ.50 వేలు డిమాండ్ చేశారు.

సోమవారం మధ్యాహ్నం శ్యామ్ రావు రూ.38 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు వలవన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గతంలో చెన్నూర్ ఏరియాలో పనిచేసిన వంశీకృష్ణ అవినీతి ఆరోపణల కారణంగా సస్పెండ్ అయి కొన్నాళ్లకు విధుల్లో చేరారు. నిందితునిపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టుకు పంపుతున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

# ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడ్డ "రేమల్" చక్రవాతాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకొంటున్న సన్నాహక చర్యలను సమీక్షించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 27 :ఉత్తర బంగాళాఖాతం లో ఏర్పడిన చక్రవాతం "రేమల్" ను దృష్టి లో పెట్టుకొని తీసుకొంటున్న సన్నాహక చర్యల ను సమీక్షించడం కోసమని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న 7, లోక్ కల్యాణ్ మార్గ్ లోని తన నివాసం లో నిర్వహించిన ఒక సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఐఎమ్ డి ముందస్తు అంచనాల ప్రకారం, ఈ పెను తుపాను బాంగ్లాదేశ్ ను మరియు బాంగ్లాదేశ్ ను ఆనుకొని ఉన్న పశ్చిమ బంగాల్ కోస్తా తీర ప్రాంతాల మధ్య సాగర్ దీవులు మరియు బాంగ్లాదేశ్ లోని నైరుతి దిక్కున గల మొంగ్ లా కు సమీపం లోని ఖేపుపారా మధ్యన తీరాన్ని దాటే అవకాశం ఉంది. దీని పర్యవసానం గా పశ్చిమ బంగాల్ లోను మరియు ఈశాన్య ప్రాంత రాష్ట్రాల లోను వర్షాలు కురవవచ్చును.

జాతీయ విపత్తు నిర్వహణ సంఘం పశ్చిమ బంగాల్ ప్రభుత్వం తో క్రమం తప్పక సంప్రతింపులను జరుపుతూ ఉంది అన్న సంగతి ని ప్రధాన మంత్రి కి వివరించడమైంది. దక్షిణ బంగాళాఖాతం లోకి మరియు అండమాన్ సముద్ర ప్రాంతం లోకి వెళ్లవద్దు అంటూ మత్స్యకారులందరి కి సలహాను ఇవ్వడమైంది. దాదాపు గా ఒక లక్ష మంది ప్రజల ను సురక్షితమైనటవంటి స్థలాల కు తరలించడం జరుగుతున్నది.

తాజా పరిణామాలను గురించిన సమాచారాన్ని ఐఎమ్ డి ఎప్పటికప్పుడు బాంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలియజేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి భారత ప్రభుత్వం పూర్తి సమర్థన ను అందిస్తోందని, మరి నిరంతరాయంగా ఈ విధమైనటువంటి సమర్థన ను అవశ్యం అందిస్తూ ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు. స్థితి ని దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తూ ఉండాలని, చక్రవాతం తీరాన్ని దాటిన అనంతరం పునరుద్ధరణ పనుల నిమిత్తం అవసరపడిన సహాయాన్ని అందించడం కోసం సమీక్ష ను చేపట్టాలని ఆయన అన్నారు.

ఇప్పటికే పశ్చిమ బంగాల్ లో మోహరించిన ఎన్ డిఆర్ఎఫ్ బృందాలు పన్నెండు మరియు ఒడిశా లో ఒక ఎన్ డిఆర్ఎఫ్ బృందానికి తోడు మరిన్ని బృందాల ను సిద్ధం గా ఉంచి ఒక గంట వ్యవధి లోపల అవి రంగం లోకి దిగేందుకు తయారు గా ఉండాలి అని ప్రధాన మంత్రి ఆదేశాలను ఇచ్చారు.

ఏదైనా అత్యవసర స్థితి ఎదురైతే భారతీయ కోస్తా తీరరక్షకదళం తన శక్తులను రంగం లోకి దింపుతుంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలనరు అయినా నివారించడానికి గాను నౌకాశ్రయాలు, రైల్ వేస్ మరియు హైవేస్ అత్యంత జాగరూకత తో ఉండాలి అని ఆయన అన్నారు.

ఈ సమావేశం లో ప్రధాన మంత్రి కి ప్రిన్సిపల్ సెక్రటరీ, కేబినెట్ సెక్రట్రి, హోం సెక్రట్రి, ఎన్ డిఆర్ఎఫ్ డిజి, ఐఎమ్ డి డిజి, ఇంకా ఎన్ డిఎమ్ఎ సెక్రట్రి లు కూడ పాల్గొన్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ ఆహ్వానము
తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో
"యుద్ధగీతం", "కవన సమీరాలు" రెండు పుస్తకాల
ఆవిష్కరణ సభ
తేది : 01-జూన్, 2024 శనివారం సాయంత్రం : 5-00 గం॥లకు
వేదిక : కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.
సభాధ్యక్షులు : యెనిశెట్టి గంగాప్రసాద్ గారు ప్రముఖ కవి, రచయిత
ముఖ్య అతిథి : బైస దేవదాస్ గారు "నేటి నిజం" తెలుగు దినపత్రిక సంపాదకులు
ప్రత్యేక అతిథులు :
తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి గారు ప్రముఖ సంఘసేవకులు, సాహితీ పోషకులు
కొండి మల్లారెడ్డి గారు ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు
విశిష్ట అతిథులు
డా॥ జి. లచ్చయ్య గారు ప్రముఖ రచయిత, కాలమిస్టు.
సూరారం శంకర్ గారు ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు, కీర్తి పురస్కార గ్రహీత
వి.పి. చందన్‌రావు గారు ప్రముఖ రచయిత, నిజామాబాద్
డా॥ యస్.కె. రషీద్ గారు ప్రిన్సిపాల్, కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.
మారవేణి రాజన్న గారు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కామారెడ్డి.
ఆత్మీయ అతిథులు

డా॥ కాసర్ల నరేష్ రావు గారు ప్రముఖ కవి, రచయిత
నార్ల అరుణ్ కుమార్ గారు పండిత పరిషత్ టి. జిల్లా అధ్యక్షులు
అంభీర్ మనోహర్‌రావు గారు ప్రముఖ వ్యాఖ్యాత
అల్లి మోహన్ రాజ్ గారు తె.ర.వే. జిల్లా ప్రధాన కార్యదర్శి
డా॥ బాలు గారు రక్తదాతల సమూహ ఫౌండర్, కామారెడ్డి జిల్లా.
కప్పెర రవీందర్ రెడ్డి గారు వైస్ ఎంపిపి, బీబీపేట్.
వెంగల నాగరాజు గారు తె.ర.వే. జిల్లా అధ్యక్షులు, రాజన్నసిరిసిల్ల.

పుస్తక సమీక్షకులు
సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గారి "యుద్ధగీతం" ----- డా॥ మేకల రామస్వామి గారు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు
ఎన్నీల ముచ్చట్లు ఉగాది కవితా సంకలనం "కవన సమీరాలు" ----- డా॥ నమిలకొండ సునీత గారు ప్రముఖ రచయిత్రి
సభా ఆహ్వానం, కార్యక్రమ సమన్వయం, వ్యాఖ్యానం పబ్బ విజయశ్రీ గారు ప్రముఖ వ్యాఖ్యాత
నోట్ : రక్తదాతల సమూహం, కామారెడ్డి సభ్యులకు సత్కారం.
"కవన సమీరాలు" పుస్తకంలోని కవులకు అతిథులచే సత్కారం.
కార్యక్రమానంతరము భోజన సౌకర్యం కలదు

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

అమరావతి, మే 27 :రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సునీల్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తెల్లవారుజామున గుంటూరు ఇన్నర్ రింగురోడ్డు సమీపంలో రోడ్డు పై ఉన్న స్పీడ్ బ్రేక్‌ను గమనించకపోవడంతో ప్రమాదం వాటిల్లింది. తలకు తీవ్ర గాయమై రక్తస్రవం జరగడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

మృతదేహాన్ని పెద్దకాకాని పి.ఎస్ ఏ.ఎస్.ఐ ఆంటోనీ రాజ్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తోటి కానిస్టేబుల్ చనిపోవడంతో ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఇక్కడి నుంచి ఢిల్లీకి ముడుపులు.. బీజేపీ నేత ప్రభాకర్

**-తెలంగాణలో ఆస్తులు తరుగుతుంటే, మంత్రుల ఆస్తులు పెరుగుతున్నాయి**

**-సివిల్ సప్లై అవినీతిపై సమగ్ర విచారణ జరపాల్సిందే..**

హైదరాబాద్, మే 27 :సివిల్ సప్లై శాఖలో భారీగా అవినీతి జరుగుతోందని, తక్షణమే ఆ శాఖపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై రచ్చ జరుగుతుంటే సీఎం కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ఢిల్లీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకే మంత్రులు తహతహలాడుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయంలో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ?. ముఖ్యమంత్రి సమీక్షలకు సంబంధిత మంత్రులు హాజరుకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారని తెలిపారు. మంత్రివర్గ కూర్పులో ముఖ్యమంత్రి నామ్ కే వాస్తే గా ఉన్నారని తెలిపారు. ఢిల్లీకి కప్పం కట్టేందుకే మంత్రివర్గం ఉన్నట్లు ఉందన్నారు.

ధనిక రాష్ట్ర ఆస్తులు తరుగుతున్నాయని, మంత్రుల ఆస్తులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు.

సివిల్ సప్లై శాఖను గతంలో బీఆర్ఎస్, ఈరోజు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలులో జరిగే అవినీతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ ఒక్కో దశ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ఢిల్లీ వెళ్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ వెళ్లే విమానాన్ని ఎన్నికల కమిషన్ తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాకు నీవు.. నీకు నేను అన్నట్లుగానే వ్యవహరిస్తున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు.

రైతుల విషయంలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీరియస్ అయ్యారు ప్రభాకర్. అకాల



వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మొక్కుబడిగా చెప్పిన ప్రభుత్వం ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. అనేక మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదన్నారు. వరికి రూ.500 బోనస్‌పై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటం లేదన్నారు. గతంలో కేసీఆర్ రుణమాఫీ చేస్తానని పదేళ్ల పాటు నాన్చారని.. ఇప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని.. ఆ పేరుతో అప్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# లారీ, కారు ఢీ.. నలుగురు మృతి

అమరావతి, మే 27 :అదుపు తప్పిన కారు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటనకృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు హెచ్ పీ పెట్రోల్ బంక్ సమీపంలో చోటు చేసుకుంది.

సమాచారం అందుకున్న హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు లక్ష్మీ నరసింహామూర్తి, వీరవల్లి ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. అయితే, కొవ్వూరు నుంచి తమిళనాడు కారులో వెళుతుండగా ఈ రోడ్డు ప్రమాదం జరిగింది అని పోలీసులు తెలిపారు.

ఇక, మృతులు అందరు తమిళనాడుకి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

కాగా, వీరందరు ఒకే కుటుంబానికి చెందిన స్వామినాథన్ (40), రాకేష్ (12), రాధప్రియ (14), గోపి(23) అక్కడిక్కడే మృతి చెందగా సత్య (28) (స్వామినాథన్ భార్య ) తీవ్రంగా గాయపడింది. తీవ్రంగా గాయపడిన సత్య అనే మహిళను వైద్య చికిత్స నిమిత్తం అంబులెన్సు లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహదారిపై ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా రోడ్డు ప్రమాదం లో నుజ్జునుజ్జైన కారును హైవే పెట్రోలింగ్ సిబ్బంది పక్కకు తీస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదం..నలుగురు స్పాట్ డెడ్

తిరుపతి, మే 27 :ఏపీలోని తిరుపతి జిల్లాలో ఈ తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. కొంగరివారిపల్లి దగ్గర ఓ కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వీళ్లంతా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి బెంగళూరు వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే, మృతులు నెల్లూరు జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఇంకా మృతుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. కారు కల్వర్ట్‌లో ఇరుక్కున్న దాన్ని బట్టి అతివేగం, నిద్రమత్తు ఈ ప్రమాదానికి కారణాలుగా పోలీసులు అంచనా వేశారు.

ఇక, గడ్డపార సహాయంతో కల్వర్టుపై ఇరుక్కున్న కారు డోర్లను బద్ధలు కొట్టి మృతదేహాలను పోలీసులు బయటకు తీసేశారు. మృతుల వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని.. దర్యాప్తు చేస్తున్నారు.

# బిజెపి ప్రభుత్వ హయాంలో మాఫియా వణుకుతోంది

## -యుపినిఎస్‌పి మాఫియా 'సురక్షిత రహస్య స్థావరం'గా మార్చింది
## -మిర్జాపూర్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ



మిర్జాపూర్ (యుపి) మే 27(ఎక్స్ ప్రెస్ న్యూస్ ): : ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం సమాజ్‌వాది పార్టీ (ఎన్‌పి)ని తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. ఎస్‌పి మిర్జాపూర్‌ను అపఖ్యాతి పాల్జేసిందని, ఉత్తర ప్రదేశ్‌ను, పూర్వాంచల్‌ను మాఫియాకు 'సురక్షిత రహస్య స్థావరం'గా మార్చిందని ప్రధాని మోడీ ఆరోపించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిని మతతత్వం, కులతత్వంతో కూడుకున్నదని ఆయన అభివర్ణించారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజ్యాంగాన్ని మార్చాలని వారు నిర్ణయించారని ఆయన ఆరోపించారు. ఎస్‌పిపై ప్రధాని మోడీ మరింతగా విరుచుకుపడుతూ, ఆ పార్టీతో సంబంధం ఉన్నవారికి శాంతి భద్రతలు అయిష్టమని విమర్శించారు. మిర్జాపూర్ లోక్‌సభ సీటులో ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షం అప్నా దళ్ అభ్యర్థి అనుప్రియా పటేల్, రాబర్ట్‌గంజ్ లోక్‌సభ సీటు అభ్యర్థి రింకీ కోల్‌కు మద్దతుగా మిర్జాపూర్‌లో ఒక ఎన్నికల సభలో మోడీ ప్రసంగిస్తూ, 'ఎన్‌పితో సంబంధం ఉన్నవారు శాంతి భద్రతల పరిస్థితిని శత్రుత్వ భావంతో చూస్తుంటారు. నిర్బంధిత ఉగ్రవాదులను ఎస్‌పి నాయకులు విడుదల చేయిస్తుండేవారు. ఉగ్రవాదిని పట్టుకున్నందుకు పోలీస్ అధికారులను ఎస్‌పి ప్రభుత్వం సస్పెండ్ చేస్తుండేది' అని ఆరోపించారు. ఎస్‌పి మిర్జాపూర్‌ను అపఖ్యాతి పాల్జేసిందని, 'మొత్తం యుపిని, పూర్వాంచల్‌ను మాఫియాకు సురక్షిత రహస్య స్థావరంగా మార్చివేసిందని మోడీ ఆరోపిస్తూ, ఎస్‌పి ప్రభుత్వ హయాంలో జనం భయంతో వణికిపోతుండేవారని, కానీ బిజెపి ప్రభుత్వ హయాంలో మాఫియా భయంతో వణికిపోతోందని చెప్పారు. 'ఎస్‌పి ప్రభుత్వ హయాంలో ప్రాణం గాని, స్థలం గాని ఎప్పుడు పరుల హస్తగతం అవుతుందో ఎవరికీ తెలియదు. ఎన్‌పి ప్రభుత్వ హయాంలో మాఫియాను వోటు బ్యాంకుగా చూశారు. కానీ ఇప్పుడు యోగి ఆదిత్యనాథ్, ఆయన ప్రభుత్వం ఇక్కడ నా ప్రక్షాళన కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతోంది' అని మోడీ చెప్పారు. ఎస్‌పి, కాంగ్రెస్ వోటు బ్యాంకుకు అంకితం కాగా, మోడీ వెనుకబడిన తరగతులు, నిరుపేదలకు అంకితం అయినట్లు ఆయన ఉద్ఘాటించారు. 'దేశ ప్రజలు ఇండియా కూటమివారిని అర్థం చేసుకున్నారు. వారు పక్కా మతతత్వ, కులతత్వ, అనువంశిక వాదులు. వీరి ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడినా వీరు ఆ ప్రాతిపదికపైనే నిర్ణయాలు తీసుకుంటుంటారు' అని ఆయన అన్నారు. ఎన్‌పి 2012 యుపి అసెంబ్లీ ఎన్నికలకు మేనిఫెస్టోలో 'ముస్లింలకు రిజర్వేషన్ కల్పనకు, రాజ్యాంగం మార్పునకు' వాగ్దానం చేసిందని ఆయన ఆరోపించారు.'తుదకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఎస్‌పి తమ మేనిఫెస్టోలో ముస్లింలకు రిజర్వేషన్లు ప్రకటించింది. చివరకు పోలీస్ శాఖ, పిఎసి (ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కాన్‌స్టబ్యులరీ)లో కూడా ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఎస్‌పి ప్రకటించింది' అని మోడీ తెలిపారు. 'ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లను హస్తగతం చేసుకుని వాటిని ముస్లింకు ఇవ్వాలని ఇండియా కూటమి నిర్ణయించింది. అందుకు వారు అంతిమ మార్గం కనిపెట్టారు. అదే రాజ్యాంగాన్ని మార్చడం. అందుకే వారు రాజ్యాంగాన్ని మార్చాలని కోరుకుంటున్నారు' అని ప్రధాని మోడీ ఆరోపించారు. సమాజ్‌వాది పార్టీ యాదవ్ సమాజం ప్రతిభను కూడా అలక్ష్యం చేసిందని, ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యులకు మాత్రమే టిక్కెట్లు ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఒక మంచి ఇంటిని నిర్మించేందుకు వేర్వేరు మేస్త్రీలను ఎవరూ నియోగించరని, కాని కాంగ్రెస్, ఎస్‌పి కూటమి ఐదు సంవత్సరాల్లో ప్రతి ఏడాదికి ఒకరు వంతున ఐదుగురు ప్రధానులు ఉంటారని చెబుతోందని ఆయన పేర్కొన్నారు.'ఐదు సంవత్సరాల్లో ఐదుగురు ప్రధానులను ఎవరైనా ఉంచుతారా చెప్పండి. తన పదవి రక్షణ గురించి ప్రధాని ఆందోళన చెందుతున్నప్పుడు ఆయన దేశాన్ని పటిష్ఠంగా ఉంచగలరా?' అని ఆయన అడిగారు. 'అందువల్ల సుదృఢ దేశానికి ప్రధాని కూడా బలంగానే ఉండాలని దేశం నిశ్చయించింది. అందుకే ఎన్‌డిఎ అటువంటి భారీ తీర్పు పొందుతోంది. ఎస్‌పికి వేయడం ద్వారా తమ వోటు వ్యర్థం చేసుకోవాలని ఎవ్వరూ కోరుకోరు' అని ఆయన చెప్పారు. భోజ్‌పురిలో 'జై భారత్ మాతా కీ జై, మాతా వింధ్యవాసిని' అని నినదిస్తూ తన ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోడీ 'ప్రజల వోట్ల ద్వారానే '500 ఏళ్ల తరువాత రామ మందిరం నిర్మాణం సాధ్యమైంది' అని తెలిపారు. అత్యంత బలమైన బిజెపి, ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటును దేశం సాధ్యం చేసిందని ప్రధాని ఉద్ఘాటించారు. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా సభలో ప్రసంగించారు. మిర్జాపూర్, రాబర్ట్‌గంజ్‌లో ఏడవ దశలో జూన్ 1న పోలింగ్ జరగనున్నది. వోట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలన్నీ ఉత్త మాటలే: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలన్నీ ఉత్త మాటలేనని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు, ఆదివారం మీడియా తో మాట్లాడుతూ సివిల్ సప్లయ్ శాఖలో వందల కోట్ల స్కాం అవకతవకలు జరిగాయన్నది వాస్తవ మన్నారు. ఆధారాతో సహా నేను గత నలుగు రోజులుగా చెపుతూ వస్తున్నానని తానూ ప్రశించిన 19 అంశాలకు సమాధానం చెప్పలేక మంత్రి దాటవేయడంతోనే మంత్రి డొల్లతనం బయటపడిందని ఎద్దేవా చేసారు. సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి పై సిబిఐ విచారణ జరుగావలసిందీ నని, దీనిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకేలుతున్నట్లు తెలిపారు.

# బిజేపీ నేత ఈటెల రాజేందర్‌ను కలిసి అభినందనలు తెలిపిన పలువురు ప్రముఖులు

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఈరోజు శామీర్ పేట లో బిజేపీ నేత ఈటెల రాజేందర్ నివాసంలో రిటైర్డ్ ప్రొఫెసర్ దాసి సాంబయ్య గారి ఆద్వర్యంలో ఆదర్శ కిరణం మాస పత్రిక ఎడిటర్ వంగాల బాలరాజు గౌడ్, యాదవ టుడే మాసపత్రిక ఎడిటర్ భిక్షపతి యాదవ్,.తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ అడ్వైసర్ ముద్దగోని రామ్ మోహన్ గౌడ్, మరియు రాజేంద్ర బాబూ కలిసి మల్కాజ్ గిరి పార్లమెంటు అభ్యర్థి గా భారీ మెజారిటీ తో గెలవబోతున్నందుకు మర్యాద పూర్వకంగా కలసి ముందస్తు శుభా కాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

## - ముఖ్యమంత్రికి లోక్ సత్తా పార్టీ బహిరంగ లేఖ"



హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ రాష్ట్రంలోని పాఠశాలలలో విద్యార్థుల కు నాణ్యమైన విద్య అందించాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్ చేసారు. ముఖ్యమంత్రికి లోక్ సత్తా పార్టీ తరపున బహిరంగ లేఖ"ను మీడియా సమావేశం లో విడుదల చేసారు. ఈ సందర్భంగా తుమ్మనపల్లి శ్రీనివాసు మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాలలలో విద్యార్థుల నమోదు ప్రపంచ స్థాయి సగటును 99శాతం దాటినప్పటికీ కూడ ఆ స్థాయిలో మౌలిక సౌకర్యాలు, నాణ్యమైన విద్య కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలం అయ్యాయని దిగజారిన పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చికిత్స ప్రారంభించాలని డిమాండ్ చేసారు. మంచి ప్రమాణాల విద్యను అందించటానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని గౌ.ముఖ్యమంత్రి వర్యులకు ఈ -మెయిల్ ద్వారా పంపిన బహిరంగ లేఖలో కోరినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని తెలుగు మీడియం పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ప్రోత్సహించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థిపై ప్రతీ ఏటా 60వేల రూపాయల పైన ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదని దీనిపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని బడులలో మౌలిక సదుపాయాలు త్రాగునీరు, వంట గదులు, భోజన హాల్లు, రుగుదొడ్లు, ల్యాబ్, గ్రంధాలయం, క్రీడా ప్రాంగణాలు వుండేలా చర్యలు తీసుకోవాలని శిధిలావస్థలో వున్న బడులకు మరమ్మత్తులు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే చేపట్టాలని తుమ్మనపల్లి ప్రభుత్వానికి సూచించారు. ఇంకా ఈ సమావేశంలో కార్యదర్శులు సరోజాదేవి, మల్లాది కిషోర్, కారుమంచి గణేష్,మురళీ , విద్యా కమిటీ కన్వీనర్ వంశీ ప్రసాద్, సభ్యులు వరుణ్, సుబ్రమణ్యం, ప్రాణేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# వేరువేరు ఘటనలో ఏడుగురు దుర్మరణం

## -నిర్మాణంలో ఉన్న డైరీ షెడ్డు కూలి నలుగురు దుర్మరణం
## -నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో ఘటన
## -ఇద్దరి పరిస్థితి విషమం,మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
## -తెలకపల్లిలో పిడుగుపాటుకు గురై 12 ఏళ్ల బాలుడు మృతి
## -తుఫాన్ వాహనంపై రాయిపడి డ్రైవర్ మృతి



నాగర్ కర్నూల్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); నాగర్ కర్నూల్ జిల్లాలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వేరువేరు ఘటనల్లో మొత్తం ఏడు గురు మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ శివారులో నిర్మాణంలో ఉన్న డైరీ షెడ్డు భారీ ఈదురుగాలులకు రేకులు ఎగిరిపడి గోడ కూలడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రానికి శివారు లో అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో బెల్లె మల్లేష్ అనే రైతు పొలంలో డైరీ షెడ్డును నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం భారీగా ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో గాలికి రేకులు ఎగిరి పడడంతో నిర్మాణంలో ఉన్న గోడ కూలింది వర్షం వస్తున్న తరుణంలో ఆ గోడ చాటుకు నిలబడి ఉన్న ఎనిమిది మందిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తాడూరు మండల కేంద్రానికి చెందిన షెడ్డు యజమాని రైతు బెల్లె మల్లేష్ (38) ఆయన కూతురు బెల్లె అనూష (10) పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కూలీలు సల్వాజీ రాములు (35) అతని భార్య సల్వాజి చెన్నమ్మ (34) అక్కడికక్కడే మృతి చెందారు. బిల్లె రాజు (14) బెల్లె మల్లేష్ భార్య పార్వతమ్మ ,మేస్త్రీలు చిన్న నాగులు, కురుమయ్య అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చిన్న నాగులు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని నాగర్ కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.ఇదిలా ఉండగా తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్ 12 అనే బాలుడు మృతి చెందాడు. అదేవిధంగా నాగర్ కర్నూల్ శివారులోని మంతటి గడ్డ వద్ద ప్రధాన రహదారి పై శ్రీశైలం నుంచి వికారాబాద్ కు వెళ్తున్న తూఫాన్ వాహనంపై గాలివాన వస్తున్న క్రమంలో రేకులపై ఉన్న ఇటుకలు వాహనంపై పడి తీవ్రంగా గాయపడిన వికారాబాద్ జిల్లాకు చెందిన వేణు (38) అనే తుఫాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మర్గనీ మధ్యలో మృతి చెందాడు. అదేవిధం గా చారగొండ మండలం నూకల చింత తండాలో పిడుగు పడటంతో జైపాల్ నాయక్ అనే రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వెల్దండ మండలం లో పిడుగుపాటుకు గురై ఆవు మృతి చెందింది. బిజినపల్లి మండలం, నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన అంజన్ రెడ్డి అనే వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా భీకరమైన గాలి వాన రావడంతో వ్యవసాయ పొలంలోని మృతి చెందినట్లు తెలిసింది. ఇతనికి ఫిట్స్ వస్తాయని గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఇదిలా ఉండగా గాలివాన బీభత్సంతో నాగర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట కల్వకుర్తి కొల్లాపూర్ నాగర్ కర్నూల్ ప్రాంతాలలో భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి అనేక ఇళ్లకు సంబంధించి రేకులు పశువుల కొట్టా లు కొట్టుకుపోయాయి. సాయంత్రం 4:00 నుంచి విద్యుత్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీగా నష్టం వాటిల్లిందని అంచనా ఇదిలా ఉండగా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

# సోషల్ మీడియాలో వచ్చే కథనాలు అవాస్తవం: అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి, మే 27 :: సోషల్ మీడియాలో నీటి సరఫరాపై వస్తున్న కథనాలు అవాస్తవమని వాటిని ప్రజలు నమ్మద్దని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సంగారెడ్డి పట్టణానికి అంగడిపేట నుండి మంజీరా ఇంటేక్ 600 మీటర్ల వ్యాసంగల పైప్ లైన్ ద్వారా నిరంతరం నీటి సరఫరా జరుగుతుందన్నారు.

ఈ పైప్ లైన్ శనివారం రాత్రి బ్రేక్ కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే ఆదివారం మరమ్మత్తు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి మున్సిపల్ పట్టణంలోని 1, 2, 3, 5, 18, 22, ఆరు వార్డులలో ఆదివారం ఉదయం మాత్రమే నీటి సరఫరా జరగలేదన్నారు. సోషల్ మీడియా లో వస్తున్నా , మూడు రోజులు గా నీటి సరఫరా బంద్ అనే వార్త అవాస్తవమని ఆయన అన్నారు. సంగారెడ్డి పట్టణంలో, నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మరమ్మత్తుల అనంతరం నీటి సరఫరా తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పట్టణంలో పర్యటించి 05, వార్డు కాలనీవాసులతో నీటి సరఫరా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# ప్రభుత్వంపై అబద్ధాలు, అవాస్తవాలను ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయి

## - పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );ప్రభుత్వంపై అబద్ధాలు, అవాస్తవాలను ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు ఆదివారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో భారీ పరిశ్రమల శాఖ మంత్రి, శ్రీధర్ బాబు, జీసీన్ రెడ్డి ఎమ్మెల్సీ, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ, లక్ష్మణ్ కుమార్, సంజీవ రెడ్డి ఎమ్మెల్యేలు, రాంమోహన్ రెడ్డి లతో కలిసి మాట్లాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నయ పైసా నిజం లేదన్నారు.

గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ డిపార్ట్మెంట్ 58వేల కోట్లు అప్పులు చేసిందిసివిల్ సప్లయ్ కార్పొరేషన్ లో గత ప్రభుత్వం చేసిన అప్పులు 11వేల కోట్లుగత ప్రభుత్వం కంటే ముందే ధాన్యం కొనుగోలు మొదలు పెట్టాంతడిచిన ధాన్యాన్ని ఎమ్మేస్పీ ధరకి కొనాలనివిప్లవాత్మక స్టెప్ తీసుకున్నామన్నారు. అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు కొన్న ఏకైక ప్రభుత్వం మాదే నన్నారు.కేటీఆర్, మహేశ్వర రెడ్డితెలిసి తెలియకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని,బాధ్యత రాహిత్యమైన ఆరోపణలు చేస్తే ఊరుకోనని,మిల్లర్ల దగ్గర డబ్బులు తీసుకోవడం కాదు కదా కనీసం వాళ్ళని కలవలేదునాలాంటి నిజాయితీ పరుడిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదని హితవు పలికారు. సన్నబియ్యం ఒక్క గింజ కూడా కొనలేదు42 రూపాయలకు కిలో సన్న బియ్యం అమ్మితే ప్రభుత్వం వెంటనే కొంటుంది

.టెండర్ లో ఉన్న కండిషన్స్ కి ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుందిమిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం మాదే నన్నారు. మిల్లర్లలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని,డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడుతోందిమిల్లర్ల పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విమర్శిస్తున్న వాళ్ళే మిలర్లను ఇబ్బందులు పెడుతున్నారని అంటున్నారుబీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర రెడ్డి పై ఉత్తమ్ ఫైర్ ఐనారు. డిల్లీకి డబ్బులు పంపి ఫ్లోర్ లీడర్ పదవి కొనుక్కున్నారని ఆరోపించారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం మాట్లాడే సంస్కారం మాది కాదుమహేశ్వర రెడ్డిఅవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని,కిషన్ రెడ్డిని ఓవర్ టేక్ చేయాలని మహేశ్వర రెడ్డి భావిస్తున్నారన్నారు. పార్టీలో ఓవర్ స్పీడ్ గా పోవాలని మహేశ్వర రెడ్డి అనుకుంటున్నాడని,సన్న ధాన్యానికి గత ప్రభుత్వంలో 1700 వచ్చింది. ఇప్పుడు 2400 వస్తోందిమిల్లర్లపై గత ప్రభుత్వం బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు.

# చిలుకూరు బాలాజీని దర్శించుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, మే 27 :రాష్ట్ర మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం చిలుకూరు బాలాజీ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.


ఈ సందర్భంగా మల్లారెడ్డి భక్తులతో పాటు స్వామివారికి ప్రదర్శనలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట పలువురు భక్తులు, అభిమానులు ఉన్నారు.

# హైదరాబాద్ 'జూ'కు భారీగా సందర్శకులు.. నిన్న ఒక్కరోజే 30 వేల మంది విజిట్




హైదరాబాద్, మే 27 : వేసవి సెలవులు జూన్ 12వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూ పార్కుకు సందర్శకులు పోటెత్తారు. గత రోజుల నుంచి భారీ సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నారు. అయితే ఆదివారం ఒక్కరోజే 30,361 మంది జూ పార్కును సందర్శించినట్లు అధికారులు వెల్లడించారు. సందర్శకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జూ అధికారులు చర్యలు తీసుకున్నారు. మే 19న 25 వేల మంది జూ పార్కును విజిట్ చేశారు. నిన్న 30,361 మంది సందర్శించారు. వచ్చే ఆదివారం ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# తొలి ఓటు వేసిన మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, మే 27 :ఖమ్మం - నల్లగొండ - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఇవాళ జరుగుతుంది. ఈ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 457 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఆయన తొలి ఓటు వేశారు.

ఈ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 673 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ ప్రారంభానికి ముందే బూత్‌కు వచ్చిన జగదీశ్ రెడ్డి తొలి ఓటు వేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లను లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరుసటి రోజైన జూన్ 5న లెక్కించనున్నారు.



# శ్వేత హోటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు..



కరీంనగర్, మే 27 : ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదివారం కరీంనగర్ జిల్లా నడిబొడ్డున ఉన్న శ్వేతా హోటల్లో తనిఖీలు నిర్వహించారు. హోటల్లోని కిచెన్, స్టోర్ రూమ్ ల లోని వస్తువులను పరిశీలించారు. నాసిరకం తినుబండారాలు, ఎక్స్పైరీ అయిపోయిన జీడిపప్పు, ఇతర వస్తువులను గుర్తించారు. చాక్లెట్ సిరప్ ఇతర వస్తువులను గుర్తించి శాంపిళ్లను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామని అధికారులు తెలియజేశారు.

# అమ్మవారి ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు..

అమరావతి, మే 27 : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో కనకదుర్గమ్మ దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. ఓ వైపు సార్వత్రిక ఎన్నికలు ముగియనున్న నేపథ్యంలో మరోవైపు వేసవి సెలవులు ముగుస్తున్న తరుణంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివస్తున్నారు.

గత 3 రోజులుగా పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న భక్తులు రాక కారణంగా ఆదివారం రికార్డు స్థాయిలో అమ్మవారి ఆలయ ఆదాయం పెరిగింది. ఆదివారం రాత్రి 8 గంటల వరకు అమ్మవారిని 43,900 మంది దర్శించుకోగా క్యూలైన్లో దర్శనం కోసం ఇంకా భక్తులు వేచి ఉన్నారు.

గత మూడు రోజులుగా సుమారుగా లక్షన్నర మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ భారీగా పెరగడంతో అమ్మవారి ఆలయానికి కూడా అదే రీతిలో ఆదాయం పెరిగింది. దర్శన టిక్కెట్లు, కేశఖండన లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగింది.

వివిధ టిక్కెట్ల ద్వారా రికార్డు స్థాయిలో రూ.46,15,935 మొత్తం ఆదాయం సమకూరింది. శనివారం నాడు 40,100 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా వివిధ రూపాల్లో రూ.32,43,009 ఆదాయం సమకూరినట్లు అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఆలయంలో మొత్తం భక్తుల సంఖ్య 46,500 కాగా, మొత్తం ఆదాయం రూ.42,50,735గా ఉంది. రోజు రోజుకు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయ డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు ముందస్తు ప్రణాళికలో భాగంగా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

# ఆటో గ్యాలరీని ప్రారంభించిన మంత్రి తుమ్మల



ఖమ్మం, మే 27 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం 20వ డివిజన్ మమతా రోడ్ లో ఎస్కే సలీం ఆటో గ్యాలరీని ప్రారంభించిన తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నూకల నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరావు, ఓబిసి జిల్లా చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రటరీ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సాదు రమేష్ రెడ్డి, కార్పోరేటర్ కమర్తపు మురళి, కమతం రామకృష్ణ, బెల్లంకొండ వాసు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక సాధికారత జాతీయ ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి అభినందనలు

న్యూఢిల్లీ, మే 27 :ఈరోజు (మే 27, 2024) న్యూఢిల్లీలో బ్రహ్మ కుమారీస్ నిర్వహించిన 'స్పిరిచ్యువల్ ఎంపవర్మెంట్ ఫర్ ఎ క్లీన్ అండ్ హెల్తీ సొసైటీ' జాతీయ ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్ర, దేశాల చరిత్రలో సువర్ణ అధ్యాయాలు ఎప్పుడూ ఆధ్యాత్మిక విలువలపైనే ఆధారపడి ఉన్నాయని అన్నారు. ఆధ్యాత్మిక విలువలను విస్మరించి కేవలం భౌతిక ప్రగతి మార్గాన్ని మాత్రమే అవలంబించడం అంతిమంగా వినాశకరమైనదని ప్రపంచ చరిత్ర నిరూపించింది. ఆరోగ్యకరమైన మనస్తత్వం ఆధారంగా మాత్రమే సంపూర్ణ శ్రేయస్సు సాధ్యమవుతుంది. నిజమైన ఆరోగ్యవంతమైన వ్యక్తి భౌతిక, మానసిక మరియు ఆధ్యాత్మిక మూడు కోణాలను కలుస్తారు. అలాంటి వ్యక్తులు ఆరోగ్యకరమైన సమాజాన్ని, దేశాన్ని మరియు ప్రపంచ సమాజాన్ని సృష్టిస్తారు.

ఆధ్యాత్మిక సాధికారతే నిజమైన సాధికారత అని రాష్ట్రపతి అన్నారు. ఏదైనా మతం లేదా మతం యొక్క అనుచరులు ఆధ్యాత్మికత మార్గం నుండి తప్పుకున్నప్పుడు, వారు మతోన్మాదానికి గురవుతారు మరియు అనారోగ్య మనస్తత్వానికి గురవుతారు. ఆధ్యాత్మిక విలువలు అన్ని మతాల ప్రజలను ఒకరికొకరు కలుపుతాయి.

స్వార్థానికి అతీతంగా ప్రజా సంక్షేమ స్ఫూర్తితో పనిచేయడం అంతర్గత ఆధ్యాత్మికతకు సామాజిక వ్యక్తీకరణ అని రాష్ట్రపతి అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం దానధర్మాలు చేయడం అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక విలువలలో ఒకటి. భయం, టెర్రర్ మరియు యుద్ధాన్ని ప్రోత్సహించే శక్తులు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో చాలా చురుకుగా ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు. అటువంటి వాతావరణంలో, బ్రహ్మ కుమారి సంస్థ 100 కంటే ఎక్కువ దేశాలలో అనేక కేంద్రాల ద్వారా మానవాళి యొక్క సాధికారత కోసం సమర్థవంతమైన వేదికను అందించింది. ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడం ద్వారా సార్వత్రిక సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేయడానికి ఇది ఒక అమూల్యమైన ప్రయత్నం. బ్రహ్మ కుమారీస్ ఇన్స్టిట్యూషన్ ప్రపంచంలోనే మహిళలు నిర్వహిస్తున్న అతిపెద్ద ఆధ్యాత్మిక సంస్థ అని రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంస్థలో బ్రహ్మకుమారీలు ముందు వరుసలో ఉంటారని, వారి సహచరులు బ్రహ్మకుమార్లు నేపథ్యంలో పనిచేస్తున్నారని ఆమె అన్నారు. అటువంటి విశిష్టమైన సామరస్యంతో ఈ సంస్థ నిరంతరం ముందుకు సాగుతోంది. అలా చేయడం ద్వారా, ఇది ప్రపంచ సమాజానికి ఆధ్యాత్మిక పురోగతి మరియు మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన ఉదాహరణను అందించింది.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిపి



హన్మకొండ, మే 27: (నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కి నేడు జరుగుతున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ సోమవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ తో పాటు మట్టేవాడ, హనుమకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇస్లామియా కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ బందోబస్తు తో పాటు పోలింగ్ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్థానిక పోలీస్ అధికారులతో పాటు, పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకున్నారు.

# అత్యవసర చికిత్సపై సదస్సు

ఖైరతాబాద్, మే 26 : అత్యవసర చికిత్సపై నిమ్స్ దవాఖానలోని ఆడిటోరియంలో ఆదివారం సదస్సు జరిగింది. అంతర్జాతీయ ట్రామా అండ్ క్రిటికల్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప.. రోగి ప్రాణాలను రక్షించేందుకు అత్యవసర చికిత్స ఆవశ్యకత, వైద్యుల బాధ్యతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ ఆశిమా శర్మ పాల్గొన్నారు.

# పోక్సో కేసు.. కర్నూలు కోర్టు సంచలన తీర్పు

కర్నూలు: ఏడేళ్ల బాలికపై అత్యాచారం కేసులో పోక్సో స్పెషల్ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా కూడా విధించింది. ఈ ఘటన కర్నూలు జిల్లాలో జరిగింది. హోలగుంద మండలం బొమ్మణ హళ్లిలో బోయ రంగముని అనే వ్యక్తి 2021, ఆగస్టు 13న బాలికపై అత్యాచారం చేశారు.

అయితే అప్పుడు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి సైతం కర్నూలు పోక్సో స్పెషల్ కోర్టులో విచారణ కొనసాగింది. బాలికపై నిందితుడు రంగముని అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో నిందితుడు రంగవునికి కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా వేసింది.

# టెన్త్ విద్యార్థులకు పాఠ్యాంశంగా దేవరగట్టు ఉత్సవం

అమరావతి, మే 27 :కర్నూలు జిల్లా హోలగుంద మండలం దేవరగట్టు అడవుల్లోని కొండపై కొలువైన ఉన్న శ్రీ మాల మల్లేశ్వర స్వామి క్షేత్రానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. దసరా తరువాత రోజు స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఆ సందర్భంగా ఊరేగింపు ఘట్టంలో కర్రల సమరం ఆనవాయితీగా వస్తుంది. కొన్నేళ్లుగా దేవరగట్టులో జరిగే బన్నీ ఉత్సవానికి గొడవల వల్ల కర్రల సమరంగా ఆ పేరు వచ్చింది. ఇది సమరం కాదు.. సంప్రదాయం అని అక్కడి భక్తులు అంటున్నారు. అయితే, ఇప్పుడు ఈ దేవరగట్టు బన్నీ ఉత్సవానికి అరుదైన గౌరవం దక్కింది..

టెన్త్ కొత్త పుస్తకాల్లో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదవ తరగతి తెలుగు సబ్జెక్ట్ లో పాఠ్యాంశంగా దేవరగట్టు బన్నీ ఉత్సవాన్ని ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్ కొత్త పుస్తకాల్లో బన్నీ ఉత్సవానికి చోటు దక్కింది. ప్రతియేటా దసరా రోజు హోలగుంద మండలం దేవరగట్టులో బన్నీ ఉత్సవంలో కర్రల సమరం గురించి ఈ పాఠ్యాంశంలో పొందుపర్చబోతున్నారు. ఈ బన్నీ ఉత్సవం ప్రత్యేకత, సంప్రదాయాలను అందులో పొందుపర్చే అవకాశం ఉంది. ఈ ఉత్సవం గురించి ప్రతి ఒక్క విద్యార్థికి తెలిసేలా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన సీఈవో ఎంకే మీనా

అమరావతి, మే 27 :ఏపీ ఎన్నికల సంఘం సీఈవో ఎంకే మీనా గుంటూరులోని స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం పరిశీలించారు. నాగార్జున వర్సిటీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ లను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్‌తో కలిపి పరిశీలించారు. అనంతరం జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈవో పాల్గొన్నారు. ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలని సీఈసీ రాష్ట్రాల సీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది.

# కాల భైరవ ఆలయంలో జేపీ నడ్డా ప్రత్యేక పూజలు

న్యూఢిల్లీ, మే 27 : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తరప్రదేశ్ వారణాసిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడ కాల భైరవ ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయం ఆలయానికి చేరుకున్న నడ్డాకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాల భైరవుడికి జేపీ నడ్డా ప్రత్యేక పూజలు చేశారు. హారతి ఇచ్చారు. దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ.. కాశీ మతపరమైన నగరమని అన్నారు. ఇక్కడికి వచ్చినప్పుడల్లా కొత్త శక్తి వస్తుందన్నారు. దేశం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని, ప్రజలందరిలో ఆనందం, శాంతి నెలకొనాలని కాల భైరవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. కాశీ విశ్వనాథుడిని కూడా సందర్శించనున్నట్లు చెప్పారు.



హన్మకొండలో పింగిళి మహిళా కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి

# నకిలీ వంగడాలతో పత్తి రైతు చిత్తు..మహారాష్ట్ర సరిహద్దుల్లో జోరుగా విక్రయాలు

ఆదిలాబాద్, మే 27 :మృగశిర కార్తెకు ముందే పత్తి విత్తనాల కోసం ఉరుకులు పరుగులు పెడుతున్న పత్తి రైతు మెడకు నకిలీల ఉచ్చు యమపాశంలా బిగిస్తోంది. నకిలీ విత్తనాలు విత్తి అవి మొలకెత్తక బక్క పల్చని రైతు దిక్కుతోచని స్థితిలో బలవన్మరణాలకు పాల్పడుతుంటే.. నాసిరకం విత్తనాలను నల్ల బజారుకు తరలించి అక్రమార్కులు సునాయాసంగా కోట్లకు పడగలెత్తుతున్నారు. ప్రతిరోజు కల్తీ వ్యాపారుల ఆగడాలు బయటపడుతున్నా మొక్కుబడి కేసులతో టాస్క్‌ఫోర్స్ చేతులు దులుపుకుంటోంది. వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు అక్రమార్కుల డీలర్ లైసెన్స్ లను రద్దు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తూ చేష్టలుడిగి వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 1562 లైసెన్సు కలిగిన విత్తన దుకాణాలు ఉంటే.. అనధికారికంగా రెండు వేలకు పైగా సీడ్స్ దుకాణాలు పత్తి రైతుల జీవన మూలాధారంపై వ్యాపారం చేస్తూ లక్షలు గడిస్తున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజుల వ్యవధిలో ఆరు చోట్ల టాస్క్ ఫోర్స్ దాడుల్లో రూ.40 లక్షల విలువైన కల్తీ పత్తి విత్తనాలు బట్టబయలయ్యాయి. నకిలీ విత్తనాల దందా వెనుక రాజకీయ నేతల అండదండలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు బాసటగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు చేష్టలుడిగి వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న ఆదిలాబాద్ ఆసిఫాబాద్ కొమురం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అక్రమ విత్తనాల దందా యదేచ్ఛగా సాగుతోంది. తాజాగా ఆసిఫాబాద్ జిల్లాఎస్పీ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించగా చింతల మానేపల్లి మండలం డబ్బా గ్రామ శివారులో డంపు చేసి ఉన్న 3.25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీటి విలువ రూ. 8 లక్షల 12 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజుల వ్యవధి లోనే రూ.40 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు బయటపడడం గమనార్హం.



పిడి యాక్ట్ కేసులు పెడితేనే కల్తీ దందాకు చెక్.

అమలాక రైతులకు నకిలీ విత్తనాలు వంటగడుతూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై ప్రివెన్షన్ డిటెక్టివ్ (పీడీ) కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తేనే నకిలీ విత్తనాల దందాకు కళ్లెం పడుతుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. విత్తన చట్టాల లొసుగుల ఆధారంగా మొక్కుబడి కేసులతో నిందితులు ఒక్కరోజులోనే బెయిలుపై బయటకు వస్తున్నారు.

# సంతానోత్పత్తిపై ప్రభావం చూపే మైక్రోప్లాస్టిక్

## -ఒక గ్రామ్ కణజాలంలో 329.44 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్

## - పురుష సంతానోత్పత్తిపై ప్రభావం లి న్యూ మెక్సికో వర్సిటీ అధ్యయనం

హైదరాబాద్, మే 27(ఎక్స్ ప్రెస్ న్యూస్); మైక్రోప్లాస్టిక్ కారణంగా పురుష సంతానోత్పత్తిపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని పరిశోధకుడు జియోజంగ్ యూ పేర్కొన్నారు. పురుషుడి సంతానోత్పత్తికి కీలకమైన వృషణాల్లోనూ మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు యూనివర్సిటీ ఆఫ్ న్యూ మెక్సికో పరిశోధకులు తెలిపారు. మగ కుక్కలు, పురుషులపై ఈ అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. కుక్కలతో పోలిస్తే పురుషుల వృషణాల్లో మూడు రెట్లు ఎక్కువగా మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు గుర్తించామన్నారు.

వృషణాల్లో 12 రకాల మైక్రోప్లాస్టిక్ రేణువులను కనుగొన్నామని.. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, బ్యాగ్స్ తయారీకి వాడే పాలీఇథైలీన్ (పీఈ), పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) కూడా ఇందులో ఉన్నట్టు వెల్లడించారు. ఒక్క వృషణాల్లోనే కాదు మనుషుల రక్తం, గుండె, ఆఖరికి గర్భిణుల మావిలో (పిండం) కూడా మైక్రోప్లాస్టిక్ అవశేషాలను కనుగొన్నట్టు పరిశోధకులు వెల్లడించారు. 62 మంది గర్భిణుల మావి నమూనాలను పరీక్షిస్తే.. ప్రతీ గ్రాము కణజాలంలో 6.5 నుంచి 790 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు వివరించారు. పురుషులలో 329.44 మైక్రోగ్రాములుకుక్కలలో 122.63 మైక్రోగ్రాములు ఉన్నట్లు గుర్తించారు.


# రాజ్‌కోట్ గేమింగ్ జోన్ దుర్ఘటనపై హైకోర్టు ఆగ్రహం



అమరావతి, మే 27 :గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో 28 మందిని బలిగొన్న గేమింగ్ జోన్ అగ్నిప్రమాద ఘటనలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై గుజరాత్ హైకోర్టు విరుచుకుపడింది. రెండేళ్లుగా రాజ్‌కోట్‌లో రెండు గేమింగ్ జోన్లు ఫైర్ సేఫ్టీ సహా ఎలాంటి అనుమతుల్లేకుండానే నడుస్తున్నాయని కోర్టు దృష్టికి రావడంతో అధికారులపై కన్నెర్రజేసింది. ఈ విషయంలో ఇకపై తాము రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మబోమని తేల్చిచెప్పింది.

ఈ దుర్ఘటన జరిగిన గేమింగ్ జోన్ సంస్థ తమ అనుమతి తీసుకోలేదని రాజ్ కోట్ మున్సిపల్ కార్పొరేషన్ చెప్పగా కోర్టు మండిపడింది. 'రెండున్నరేళ్లుగా ఆ గేమింగ్ జోన్ నడుస్తోంది. మీరు, మీ అనుచరులు ఏం చేస్తున్నారు.. మీకు కళ్లు లేవనుకోవాలా..' అని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆ గేమింగ్ జోన్ లో అధికారులు ఉన్నప్పటి ఫొటోలను చూసి మరింతగా ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరంతా అంధులయ్యారా.. లేకపోతే నిద్రపోతున్నారా.. నాలుగేళ్లుగా ఫైర్ సేఫ్టీ అనుమతుల వివాదం కొనసాగుతుంటే ఏం చేస్తున్నారు? మేం ఇకపై స్థానిక యంత్రాంగాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏమాత్రం నమ్మం' అని ఘాటైన వ్యాఖ్యలు చేసింది. గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదించిన అడ్వొకేట్ మనీషా లవ్ కుమార్ షా స్పందించారు. గుజరాత్ లో అనుమతుల్లేకుండా నడుస్తున్న ఇలాంటి సంస్థల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. 72 గంటల్లో ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురు యజమానులను పోలీసులు అరెస్టు చేశారని అడ్వొకేట్ వివరించారు. మిగిలిన వారిని అరెస్టు చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.

అయితే.. ఈ వాదనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నాలుగేళ్ల కాలంలో జరిగిన ఈ తరహా ప్రమాదాల నివారణకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయినప్పటికీ గుజరాత్ లో ఆరు భారీ ప్రమాదాలు జరిగాయని పేర్కొంది. ప్రభుత్వ యంత్రాంగం పనిచేయకపోవడం వల్ల ప్రజలు మరణిస్తున్నారని వ్యాఖ్యానించింది. మరోవైపు గేమింగ్ జోన్ కు అనుమతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించనందుకు ఆరుగురు అధికారులను గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు కోసం అదనపు డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. మృతుల కుటుంబాలకు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ రూ. 4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. అలాగే గాయపడ్డ వారికి రూ. 50 వేల చొప్పున అందించారు. ఈ ప్రమాదంపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ విపత్తు నిధి నుంచి రూ. 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.

స్వ. పాతూరి మాణిక్యమ్మ జాతీయ స్థాయి స్మారక సాహిత్య పురస్కారం - 2024

మా అమ్మగారు శ్రీమతి పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం కొరకు 2023 లో ప్రచురితమైన కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నాము. ఈ ప్రకటన కేవలం కవయిత్రులకు మాత్రమే వర్తిస్తుంది. గత తొమ్మిది సంవత్సరాల నుండి ఈ పురస్కారం ఇస్తున్నాము. మీ అందరి ఆశీస్సులతో పదో సంవత్సరం లోకి అడుగు పెట్టాము. పోటీలో గెలుపొందిన కవితాసంపుటి రచయిత్రికి రూ. 5000/- నగదు బహుమతితో పాటు ఘనంగా సన్మానం జరుపబడును. మీ స్వీయకవితా సంపుటులను రెండు కాపీలు మాత్రమే 30-7-2024 లోపల ఈ క్రింది చిరునామాకు పంపవలసింది గా కోరుతున్నాము.

డా. పాతూరి అన్నపూర్ణ
1156/28-1, ప్రశాంతి నగర్, నవలాకుల గార్డెన్స్, నెల్లూరు - 524002,
ఆంధ్ర ప్రదేశ్. సెల్: 9490230939

# సివిల్ సప్లై డిపార్ట్మెంట్‌లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ

## -లేదా సీబీఐ కి అప్పజెప్పాలి .. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి డిమాండ్

## - పైరవీ చేసి పోస్టు తెచ్చుకునే సంస్కృతి కాంగ్రెస్ వారిది



హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సివిల్ సప్లై డిపార్ట్మెంట్ లో జరిగిన అవినీతి పై సిట్టింగ్ జడ్జితో తో విచారణ జరిపించాలి లేదా సీబీఐ కి అప్పజెప్పాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి డిమాండ్ సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాల్కయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ నేను మాట్లాడిన మాటలకు మంత్రి సమాదానం చెప్పకుండా నాపై పర్సనల్ ఎటాక్ చేస్తున్నారని, దీన్ని తానూ తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. నేను పైరవీ చేసి ఃఏఒఖ పోస్ట్ తెచ్చుకున్నానని చేసిన కామెంట్ సరికాదు,ఇది కాంగ్రెస్ పార్టీ కాదు బీజేపీ పార్టీ అని,బీజేపీ లో అందరి సమన్వయంతో నన్ను బీజేఎల్పీ గా నాకు అవకాశం కల్పించారన్నారు.నేను మీతో కలిసి పదేళ్లు పని చేశాను ఉత్తమ్ కుమార్ రెడ్డి మీరు పీసీసీ ఎలా తెచ్చుకున్నారో నాకు తెలీదా అని ప్రశ్నించారు.మీలా దిగజారి ఆరోపణలు చేయలేను, మా అధ్యక్షుడు అనుమతితో నే నేను సీఎం ను కలవడానికి వెళ్ళాను నీవు దాన్ని కూడా అనుమాన పడేలా మాట్లాడితే అది మీ సీఎం ను అవమానించడమే నన్నారు.ఖీ ట్యాక్స్, ః ట్యాక్స్ పై మాట్లాడినప్పుడు స్పందించలేదు,జ ట్యాక్స్ పై మాట్లాడినప్పుడు మాత్రం స్పందించారంటే అవినీతి ఎంత జరిగిందో అర్థం అవుతుంద న్నారు.బకాయిలు ఉన్న రైస్ మిలర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదుడి - ఫాల్టర్ల పేర్లను బయట పెడతారా ?తరుగు పై మంత్రి ఏనాడైనా క్షేత్ర స్థాయిలో ఎప్పుడైనా పరిశీలించారా!కుంభకోణాలు కళ్లముందు కనిపిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.ఏప్రిల్ 18న జలసౌధలో మిల్లర్లతో జరిగిన చర్చల వివరాలను ఎందుకు బయట పెట్టడం లేదు 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 4 కంపెనీలకు అప్పజెప్పారుమీకు ఈఅవ ఇచ్చిన గడువు మే 15 న ముగిసిందని, ఈఅవ ఇచ్చిన గడువు కంటే కాంట్రాక్టర్ల కు మరో నాలుగు నెలలు అదనపు సమయం ఇవ్వడం ఎంటి... అని ప్రశ్నించారు.90 రోజుల్లో ధాన్యం లిఫ్ట్ చేయని కాంట్రాక్టర్ల మీద చర్యలు ఏమైనా తీసుకుంటారా? రైస్ మిల్లర్లకు భయపెట్టి వంద రూపాయల స్టంప్ పేపర్ మీద సంతకాలు పెట్టించుకుంది వాస్తవం కాదా ?మిల్లర్లు సంతకాలు పెట్టిన బాండ్ పేపర్ బయట పెడుతున్న గడువు ముగిసిన ఒక్క బస్తా ధాన్యం కూడా టఇఃతి కి ఇవ్వలేదు దీని వెనకున్న మతలబేంటని నిలదీశారు.

నేను రాజకీయంగా మాట్లాడితే .. మీరు పర్సనల్ గా తీసుకోవాల్సిన అవసరం లేదు నేను పర్సనల్ గా తీసుకుంటే మీరు చాలా నష్టపోక తప్పదు ఇది బాగోదు జాగ్రత్త వేలెత్తి చూపిస్తే ... మీ కుందేళ్ళ సప్పుడుకి ఇక్కడ ఎవరు భయపడరని మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.ఈ అవినీతి పై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.నేను 19 ప్రశ్నలతో సీఎం కు లేఖ రాశాను,తాను చేసిన ఆరోపణల మీద ఇన్ని రోజులకైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఇందులో ఒక్క ప్రశ్నకు మాత్రమే ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పడం సంతోషమే.. నన్నారు.

# 400 స్థానాల్లో బీజేపీకి ఓటమి తప్పదు : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, మే 27 : ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 400కిపైగా స్థానాలు గెలుస్తామని బీజేపీ ఊదరగొడుతోందని, అయితే ఆ పార్టీ 400 స్థానాలు కోల్పోతుందని ఎస్పీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఘజీపూర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి అఖిలేష్ మాట్లాడారు.

యూపీలో విపక్ష ఇండియా కూటమి పట్ల ప్రజలు విశేష ఆదరణ కనబరుస్తుండటంతో ఢిల్లీ నుంచి వస్తున్న కాషాయ పాలకులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని అన్నారు. మోదీ సర్కార్ పట్ల తొలి దశ పోలింగ్‌లో నెలకొన్న వ్యతిరేకత తుది దశకు చేరేసరికి జనాగ్రహంగా పెల్లుబికిందని చెప్పారు.

బలియా, సేలంపూర్‌లో ఎస్పీ పట్ల ప్రజలు అత్యంత సానుకూలంగా ఉన్నారని, విపక్ష కూటమికి మద్దతు తెలుపుతూ వారు కేరింతలు కొట్టడాన్ని తాను స్వయంగా చూశానని అఖిలేష్ యాదవ్ వివరించారు. కాషాయ నేతల పాత డైలాగ్‌లను వినేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా లేరని, ఈ ఎన్నికల్లో వారికి ఘోర పరాజయం తప్పదని చెప్పారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతం.. బ్యాలెట్ బాక్సుల్లో తీర్పు భద్రం



హైదరాబాద్, మే 27 :వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మొత్తం 12 జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజ కవర్గాల పరిధిలో ఉన్న పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. 52 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం 4,63 ,839 మంది ఓటర్లు న్నారు. పోలింగ్ కోసం మొత్తం 605 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నిక బ్యాలట్ పేపర్ ద్వారా నిర్వహించారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సోమవారం స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయగా.. ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో పనిచేసే వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పనివేళల్లో వెసులుబాటు కల్పించారు.ఒక పోలింగ్ కేంద్రంలో సగటున 800 మంది ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. 283 పోలింగ్ కేంద్రాల్లో 800 మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలో నోటా ఆప్షన్ ఉండదు. ఈ ఎన్నికకు నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రిటర్నింగ్ అధికారి (ఆర్వో)గా వ్యవహరిస్తున్నారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్?ఎస్? అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రధానంగా మూడు పార్టీల మధ్యే పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరపున ఏనుగుల రాకేశ్‌రెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో పలు పార్టీలకు చెందిన పలువురు నేతలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూర్యాపేట లోని జూనియర్ కళాశాలలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఓటు వేశారు. భువనగిరి జిల్లా తుర్కపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న దంపతులు, హన్మకొండలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాలలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్. వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆయా జిల్లా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# ఎల్లప్పుడూ నేర్చుకుంటూ ఉండండి.. ఇది జీవితకాల ప్రక్రియ - వైస్ ప్రెసిడెంట్

న్యూఢిల్లీ, మే 27 :వైస్ ప్రెసిడెంట్, శ్రీ జగదీప్ ధన్‌ఖర్ ఈ రోజు దేశంలో ఫిట్‌నెస్ సంస్కృతిని అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు, తద్వారా ప్రతి భారతీయుడు ఆరోగ్యంగా మరియు ఆరోగ్యంగా ఉంటాడు మరియు భారతదేశం యొక్క మార్చ్ ఫర్ విక్షిత్ భారత్ ఏ 2047కి సానుకూలంగా సహకరించగలడు.

ఈరోజు కర్ణాటకలోని బెలగావిలోని ఎఐటీఖీ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ (ఔమిఓ) యొక్క 18వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆరోగ్యం విషయంలో "మన జ్ఞానం, మన విజ్ఞతతో ఇప్పటికే ఉన్నదానిపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఎఖ నొక్కిచెప్పారు.

ఆయుర్వేదం, సిద్ధ, యునాని మరియు యోగాలతో కూడిన భారత దేశం యొక్క గొప్ప సాంప్రదాయ ఔషధం, మన పూర్వీకుల ప్రగాఢ జ్ఞానానికి నిదర్శనమని గుర్తించిన ఆయన, "వారు సైన్స్, తత్వశాస్త్రం మరియు ఆధ్యాత్మికత యొక్క పరిపూర్ణ సమ్మేళనాన్ని కలిగి ఉన్నారు, సామరస్యతను నొక్కి చెప్పారు. మనస్సు, శరీరం మరియు ఆత్మ మరియు ప్రకృతి మధ్య సమతుల్యత."


భవిష్యత్ తరాలకు మన జీవవైవిధ్యం మరియు సాంప్రదాయ పరిజ్ఞానాన్ని కాపాడవలసిన అవసరాన్ని నొక్కిచెప్పిన ఎఖ ధంఖర్, దేశాన్ని ఆరోగ్య స్పృహ మరియు ఆరోగ్యంపై అవగాహన కల్పించే పుణ్య కార్యంలో ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. "నేను పంచాయితీ స్థాయిలో కూడా కోరుతున్నాను, మనం ఔషధ మరియు మూలికా మొక్కలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. రోజు చివరిలో మొక్కలు మన ప్రాథమిక అవసరాలను అందించడానికి ప్రయోగశాలగా కలుస్తాయి, ''అన్నారాయన. అనేక ఆధునిక వ్యాధులకు సరసమైన పరిష్కారాల కోసం కృషి చేస్తున్నందుకు ఔమిఓ పరిశోధకులను ప్రశంసిస్తూ, పరిశోధన మరియు అభివృద్ధికి తోడ్పడేందుకు సాధ్యమైనదంతా చేయాలని కార్పొరేట్ మరియు ప్రజా నాయకులకు ఉపాధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. "దయచేసి ముందుకు రండి; పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలు మరియు స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి మీ అూఖీని ఉపయోగించండి.

# 16 కిలోల బంగారు బిస్కెట్లు.. పట్టుకున్న బీఎస్ఎఫ్

కోల్‌కొత, మే 27 :: గోల్డ్ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లు అడ్డుకున్నారు. ఒక ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో తనిఖీ చేశారు. కోట్ల విలువైన బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామంలోని ఒక ఇంట్లో స్మగ్లింగ్ కోసం భారీగా బంగారాన్ని దాచినట్లు బీఎస్ఎఫ్‌కు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది.

కాగా, బీఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు ఆదివారం ఆ ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో ఆ ఇంట్లో సోదాలు చేశారు. లోపల దాచిన 86 బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. 16.07 కేజీల బరువున్న గోల్డ్ బిస్కెట్ల విలువ రూ.12 కోట్లకుపైగా ఉంటుందని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి దీని గురించి ప్రశ్నిస్తున్నారు.

# ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా.. ఒకరి మృతి.. 17 మందికి గాయాలు



అమరావతి, మే 27 :పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం వంబరిల్లి ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. 17 మంది గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘాట్ రోడ్డు ఎక్కుతున్న సమయంలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఆటో నుజ్జునుజ్జయింది. బాధితులంతా సీతంపేట సంత పూర్తి చేసుకొని తిరిగి ఇంటికివెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన విషయం తెలుసుకున్న స్థానికులు లోయలోకి దిగి క్షతగాత్రులను బయటకు తీసి, సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో 12 ఏళ్ల కార్తీక్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధితులను పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పరామర్శించారు.

# మెగాస్టార్ చిరంజీవికి గోల్డెన్ వీసా..




హైదరాబాద్, మే 27 :మెగా స్టార్ చిరంజీవికి తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కి చెందిన కల్చర్ అండ్ టూరిజం డిపార్ట్ మెంట్ గోల్డెన్ వీసా ఇచ్చింది. ఎమిరేట్స్ ఫస్ట్ సంస్థ ద్వారా ఈ గోల్డెన్ వీసా లభించింది. . మెగాస్టార్ చిరంజీవి కంటే ముందు, బాలీవుడ్ సహా దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకు చెందిన పలువురు తారలకు కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం గోల్డెన్ వీసా మంజూరు చేసింది, తలైవా రజనీకాంత్, షారుఖ్ ఖాన్, సంజయ్ దత్, సానియా మీర్జా, సల్మాన్ ఖాన్, బోనీ కపూర్, జాహ్నవి కపూర్, రణవీర్ సింగ్, మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్, మౌని రాయ్, మోహన్ లాల్ వంటి వారు ఈ వీసా పొందిన వారిలో ఉన్నారు..

యుఎఇ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి అగ్రశ్రేణి ప్రతిభావంతులను ఆకర్షించే లక్ష్యంతో అనేక పథకాలను ప్రారంభించింది. ఈ పథకాలలో గోల్డెన్ వీసా ఒకటి. ఈజీగా అర్థం అయ్యేలా చెప్పాలంటే, గోల్డెన్ వీసా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, పరిశోధకులు, వైద్య నిపుణులు, సైన్స్ , కళాకారులు అక్కడ ఎక్కువ కాలం స్థిరపడటానికి , అక్కడ ఉండడానికి అనుమతిస్తుంది. ఈ వీసా పథకం 2019 సంవత్సరంలో ఫోర్స్‌లోకి తెచ్చారు. అప్పటి నుంచి అమలులోనే ఉంది. ఈ వీసా 5 నుండి 10 సంవత్సరాల వరకు జారీ చేయబడుతుంది. ఇందులో వీసా హోల్డర్‌కు ప్రత్యేకాధికారాలు ఇస్తారు.

# పట్టుదలతో శ్రమిస్తే.. విజయం మీ సొంతం-మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, మే 27 : అమెరికా తెలంగాణ తెలుగు అసోసియేషన్ సభల్లో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. 2006-10 బ్యాచ్ సీఎంఆర్ విద్యార్థి చందు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో మల్లారెడ్డితో పాటు సీఎంఆర్ విద్యా సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సినీ నిర్మాత దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ తెలుగు వారిని ఉద్దేశించి, స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడాలని సూచించారు. ఏఈ, డేటా సైన్స్ తదితర నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి, పట్టుదలతో శ్రమిస్తే విజయాన్ని సొంతం చేసుకోవచ్చున్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన డా.కోట రాంబాబు




ఖమ్మం, మే 27 :(నేటినిజం ప్రతినిధి): ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామంలో చందోలు సూరిబాబు-రాణి దంపతుల కుమార్తె నూతన వస్త్రాలంకరణ వేడుకకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు హాజరై చిన్నారిని ఆశీర్వదించి నూతన వస్త్రాలను కానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కూరపాటి సుందరమ్మ-కోటేశ్వరరావు, కూరపాటి ప్రవీణ్ కుమార్, కూరపాటి రమేష్, కూరపాటి నాగేశ్వరరావు, పార్సపు ప్రసాదరావు, కూరపాటి శ్రీనివాసరావు, గట్టిగుండె కిషోర్, కూరపాటి చిన రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెల్లడి

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూశాయి. విచారణ సందర్భంగా రాధాకిషన్ రావు వాంగ్మూలంలో అనేక విషయాలు వెల్లడించారు . బిఆర్ ఎస్ కు ఇబ్బందిగా తయారైన వ్యక్తు లపై నిఘా పెట్టినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ ఎంఎల్ఏతో విభేదాల న్న శంబీపూర్ రాజు పై నిఘా పెట్టిన ట్లు తెలిపారు. జానా రెడ్డి కుమారుడు రఘువీర్ రెడ్డి, వంశీ కృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణల ఫోన్లు ట్యాప్ చేసినట్లు వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీని ట్రోలి ంగ్ చేసిన వారిని ప్రణీత్ రావు టార్గెట్ చేసినట్లు విచారణలో వెల్లడయింది. కాంగ్రెస్, బిజెపి నేతలకు డబ్బు సాయం చేసిన వారిపై నిఘా పెట్టినట్లు రాధాకిషన్ రావు ఒప్పుకన్నారు. కడియం శ్రీహరి, రాజయ్య విభేదాలపై నిఘా పెట్టామన్నారు .రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్, తీగల కృష్ణా రెడ్డి, తీన్మార్ మల్లన్న, ఈటల రాజేందర్, అర్వింద్ ఫోన్లను ట్యాప్ చేసినట్లు కూడా రాధాకిషన్ రావు వెల్లడించారు.

# ఘనంగా మాత రమాబాయి, గాయని బెల్లి లలిత వర్ధంతి



ఖమ్మం, మే 27 :(నేటినిజం ప్రతినిధి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ. ఆర్ అంబేద్కర్ సతిమణీ, గాయని బెల్లి లలిత వర్ధంతి సోమవారం వీర నారి మణుల ఆశయ సాధన సమితి ఆద్వర్యంలో అ సంఘం కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత రమా బాయి, బెల్లి లలిత చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించా రు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు షేక్.నజీమా, సంఘం గౌరవ సలహాదారులు యాక లక్ష్మి, నాగమణిలు మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎదుగుదల వెనుక మాత రమా బాయి పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో బెల్లి లలిత పోషించిన పాత్ర ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిందని పేర్కొన్నారు. ప్రతి పురుషుడు విజయం వెనుక స్త్రీ పాత్ర ఉంటుందనే విషయాన్ని మాత రమాబాయి జీవి తం మంచి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి రంగంలో స్త్రీలకు అవకాశం లభిస్తే తమ ప్రతి భను నిరూపించుకుంటారని, తెలం గాణా ఉద్యమంలో ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, గాయని బెల్లి లలి త సైతం నిరూపించారని కొనియా డారు. మాతా రమాబాయి మరణించి నేటికి 89సంవత్సరాలు కాగా, బెల్లి లలిత హత్య గావించబడి 25సంవత్స రాలు గడిచిపోయిన నేటి తరం మహిళలకు వారు స్ఫూర్తి ప్రదాతలు గానే నిలిచిపోయారని తెలిపారు. మహిళల హక్కుల సాధనకు, సాధికారతకు మాతా రమాబాయి, గాయని బెల్లి లలిత చూపిన మార్గం మనకు ఆదర్శ ప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడాల జ్యోతి, ఉపాధ్యక్షురాలు చందు, కార్యదర్శి జ్యోతి, సహాయ కార్యదర్శి లలితాబాయి, నాయకురా లు త్రివేణి, భవాని, శృతి, ఉష, శ్వేత పాల్గొన్నారు.

# రూ. 38 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ వ్యవసాయాధికారి

కొమురం భీం, ఆసిఫాబాద్, మే 27 : వ్యవసాయానికి సంబంధించిన దుకాణం రెన్యువల్ కోసం వ్యవసాయ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల వ్యవసాయ అధికారి వంశీ కృష్ణసోమవారం రూ. 38 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కారు.ఏసీబీ డీఎస్పీరమణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అయినం గ్రామానికి చెందిన మారుతి ట్రేడర్స్ యజమాని చౌదరి శ్యామ్ రావు రెన్యువల కోసం దరఖాస్తు చేసుకు న్నాడు. అయితే డబ్బులు ఇవ్వనిదే పని కాదంటూ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయిం చగా పక్కా వ్యూహాన్ని రూపొంది ంచారు.సోమవారం కార్యాలయంలో బాధితుడు రూ. 38 వేలు ఏవోకు అందజేయగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకోవడం నేరం కావడంతో అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

# కణితిని ఆపరేషన్ ద్వారా తొలగించిన కేవిఆర్ హాస్పిటల్

## - వైద్యులు డా.కోట రాంబాబు

ఖమ్మం, మే 27 :(నేటినిజం ప్రతినిధి): మన మధిరలో అత్యాధునిక, ఎన్నో పెద్ద ఆపరేషన్ లు జరిగే కేవిఆర్ హాస్పిటల్ నందు మరొక కలికితురాయి వచ్చి చేరింది. మధిర కి చెందిన ఒక యువకుడు కొన్ని సంవత్సరాల నుండి పాంక్రియాటైటిస్ వచ్చి పాంక్రియాస్ కుళ్ళిపోయి విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడు. వారు ఖమ్మంలోని ఒక హాస్పిటల్ లోని వైద్యులను సంప్రదించగా వారు ఆపరేషన్ కు లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పగా వారు కే వి ఆర్ హాస్పిటల్ గురించి తెలుసుకొని వచ్చి డాక్టర్ రాంబాబు ని కలవగా అతనికి స్కానింగ్ తీసి వారి వద్ద వున్న రిపోర్ట్స్ అన్నీ పరిశీలించి పాంక్రియాస్ కు పెద్ద కణితి వచ్చిందని వారికి వివరించి ఆపరేషన్ చేయాలి అని తెలిపారు. ఎన్నో లక్షల్లో ఖర్చు అయ్యే ఆపరేషన్ ను వారి స్థోమత తెలుసుకొని అతి తక్కువ ఖర్చుతో ఆ పాంక్రియాస్ కు వచ్చిన కణితిని తీసివేశారు. ఈ ఆపరేషన్ నిర్వహించుటలో డా.కోట రాంబాబు ఎంఎస్, కేవిఆర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. తమకు ఎంతో ఖర్చు అయి దూరప్రాంతాలలో మాత్రమే జరిగే ఇలాంటి పెద్ద ఆపరేషన్ ను వారికీ తక్కువ ఖర్చుతో విజయవంతం చేసినందుకు వారు డాక్టర్ కోట రాంబాబుకు, హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డా.రాంబాబు మాట్లాడుతూ...ఇటువంటి జబ్బులు ఎక్కువగా దీర్ఘకాలంగా ఆల్కహాల్ త్రాగే వాళ్లలో వస్తుందని కాబట్టి ఆల్కహాల్ కి దూరంగా ఉండాలని వారు కోరారు. ఆపరేషన్ విజయవంతం గా జరిగిందని రోగి ఆరోగ్యవంతంగా ఉన్నాడని తెలిపారు. పెద్ద ఆపరేషన్ లు సైతం ఇప్పుడు మన హాస్పిటల్ లో వున్న అత్యాధునిక పరికరాలతో ఉన్నత ప్రమాణాలతో తక్కువ ఖర్చుతో ఇప్పుడు మన మధిరలోనే చేయగలగుతున్నామని తెలిపారు.

# కరాటే పోటీలలో సీఎస్కెఐ క్రీడాకారులకు పతకాలు




కరీంనగర్, మే 27 : (నేటినిజం ప్రతినిధి) ఈ నెల 25,26వ తేదీలలో గోవాలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కరాటే పోటీలలో నగరానికి చెందిన కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడెమి (సీఎస్కెఐ) నుండి 10 మంది క్రీడాకారులు పాల్గొని మొత్తం 19 పతకాలతో పాటు బెస్ట్ టీమ్ కప్ అందుకున్నారు. వివిధ క్యాటగిరి కటా కుమిటి విభాగాలలో డి రిషికేశ్వర్ 1 గోల్డ్, కె పావని గోల్డ్, 1 సిల్వర్, పి శ్రీనిధి 2 గోల్డ్, అబ్దుల్ రహమాన్ 1 గొల్డ్, 1 బ్రాంజ్, ఇ నిక్షిప్త్ సాయి 1 సిల్వర్, 1 బ్రాంజ్, ఎం వైష్ణవి 2 బ్రాంజ్, కె సాయి ఆదిత్య 2 గోల్డ్, జి అనన్య 2 గోల్డ్, వై విశ్వక్ సేన్ 2 గోల్డ్, పి.శ్రేయాన్స్ నారాయణ్ 1గోల్డ్,1సిల్వర్, ఎం శ్రేయాన్స్ 1 గోల్డ్, 1 బ్రాంజ్ లు సాధించినట్లు సీఎస్కెఐ ఇండియా చీఫ్ అండ్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, నేషనల్ జాయింట్ సెక్రెటరీ షిహన్ ఇ. శ్రీనివాస్ తెలిపారు. 14 రాష్ట్రాల నుండి నుండి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పతకాలు, గ్రాండ్ ఛాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులను సీస్కెఐ ఛైర్మన్ అండ్ బీఆరెస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, కార్యదర్శి మాదుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, పెద్దిసందీప్‌లు అభినందించా రు.

# పుష్పాలంకరణ వేడుకలో మల్లి బాబు యాదవ్,చిత్తారు సింహాద్రి యాదవ్



ఖమ్మం, మే 27 :(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం చిన్నమునగాల గ్రామంలో సోమవారం మాజీ గొర్రెల సంఘం అధ్యక్షులు కంపసాటి నారాయణ-నాగలక్ష్మిల మనవరాలుభవిత శ్రీ, గీతామధు శ్రీ ఓణిల అలంకరణ వేడుక వైభవంగా జరిగింది. కంపసాటి శివరామకృష్ణ-మాధవిల పుత్రికలైన చిరంజీవుల వేడుక కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్ పాల్గొని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం సందర్భంగా అక్కడికి చేరుకున్న గొర్రెల పెంపకం దారులు గొర్రెల రుణాలు, డీడీలకు సంబంధించి ప్రస్తావించగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెలు ఇప్పిస్తానని డీడీలు కట్టించి మోసం చేసిందని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పాలసీని కొనసాగిస్తూ గొర్రెలు ఇస్తానని చెప్పిన మాట వాస్తవమేనని, కానీ గత ప్రభుత్వంలో జరిగిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో అవకతవకలు జరిగిందని, గొర్రెలు పంపిణీ చేయకున్నను చేసినట్లు చూపించి అధికార పార్టీ నేతల సహకారంతో అధికారులు, దళారులతో కుమ్మక్కైనట్లు నిర్ధారణ జరగడంతో నలుగురు ఏడి స్థాయి అధికారులను అరెస్ట్ చేయడం జరిగిందని, విచారణలో ఉన్నందున పథకాన్ని నిలుపుదల చేయడం జరిగిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎన్సీడీసీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి పదిలక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, కన్నయ్య, నాగరాజు, కాకర్ల రాము, కేతబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



రాజన్న సిరిసిల్ల, మే 27 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ విలీన గ్రామం రుద్రవరంలో "విత్తనం కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశం పైన రైతులతో గ్రామ పంచాయతీ వద్ద వ్యవసాయ అధికారి అనూష అవగాహనా కల్పిం చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, సెక్రటరీ దిలీప్ రెడ్డి, వంకాయల లక్ష్మి రాజం (హెచ్ఎం) మాజీ ఎం పీటీసీ వంకాయల భూమయ్య, మెడికల్ రాజిరెడ్డి, కత్తి కనుకయ్య,అతికం కనుకయ్య, బొంగొని మల్లయ్య, గుండెల్లి హన్మాండ్లు, పీవీ నర్సయ్య, సంతపురి మహేందర్ రెడ్డి, కూస బాల్ రెడ్డి, తాడెం నర్సయ్య,కూస రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్ కు ఎస్పీ అభినందన



రాజన్న సిరిసిల్ల, మే 27 :(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల పట్టణానికి చెందిన గాంధీ నగర్ కు చెందినా చిలగాని అనూహ్య అనే మహిళా తండ్రి శంకర్ మరణ వార్త విని గుండె పోటుకు గురై కుప్పకూలగా సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఆర్మ్డ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న గడ్డమిది శ్రీనివాస్ ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించి, ప్రశంసా పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూపోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్, ప్రథమ చికిత్స, బేసిక్ లైఫ్ సపోర్ట్ గురించి తెలుసుకుంటే విధినిర్వహణలో భాగంగా సామాన్య ప్రజలకు మెడికల్ ఎమర్జెన్సీలు సంభవించినప్పుడు సాధ్యమైనంత వరకు వారి ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

కాబట్టే జిల్లాలోని సిబ్బందికి , అధికారులకు, గ్రామస్థాయిలో రోడ్ సేఫ్టీ విలేజ్ కమిటీలు ఏర్పటు చేసి వారికి కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. చాలా వరకు తక్షణ సౌకర్యాలు లేక సహాయం లేకపోవడం వల్ల గుండెపోటు వివిధ ప్రమాదాల వల్ల ప్రజలు మరణిన్తున్నారాని, ఇలాంటి సమయాల్లో, బాగా శిక్షణ పొందిన పోలీసు అధికారులు , సిబ్బంది , సామాన్య ప్రజలు నిజంగా ఒక ప్రాణాన్ని రక్షించడంలో సహాయపడగలడని దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఉన్న సిబ్బందికి, విలేజ్ కమిటీ సభ్యులకు సీపీఆర్ , ప్రథమ చికిత్స పై శిక్షణ ఇవ్వడం జరిగిందని , ఈ శిక్షణ ఫలితమే ఒక నిండు మహిళ ప్రాణం నిలబెట్టిందన్నారు.ఎస్పీ వెంట ఆర్ఐ మాధుకర్ ఉన్నారు.

# వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవాలు ప్రారంభం



తిరుపతి, మే 27 : శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహిం చారు. అనంతరం స్వామివారిని వసంతమండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిం చారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు.

సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం స్వామివారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా జరుపనున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. వసంతోత్సవాల కారణంగా ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవం సేవను రద్దు చేసినట్లు తెలిపారు.

# జూన్ 1న 'ఇండియా' బ్లాక్ సమావేశం.. హాజరు కాబోమన్న టీఎంసీ

న్యూఢిల్లీ, మే 27 : ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ సమావేశం (ఎఔఆఎం ఎశ్రీనీఇ ఎవవబి) జూన్ 1న జరుగనున్నది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఈ మీటింగ్‌లో లోక్‌సభ ఎన్నికలు, జూన్ 4న ఫలితాలు, కూటమి భవిష్యత్తుపై చర్చించనున్నారు. అయితే ఈ సమావేశానికి తాము హాజరు కావడం లేదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పష్టం చేసింది. ఏడో దశ పోలింగ్ దీనికి కారణమని పేర్కొంది. 'ఏడో దశలో మాకు ముఖ్యమైన ఎన్నికలు ఉన్నాయి. బెంగాల్‌లో తొమ్మిది స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కోల్‌కతా, గ్రేటర్ కోల్‌కతాలోని అన్ని స్థానాలకు ఆ రోజున ఓటింగ్ ఉంది. టీఎంసీకి ఇది పెద్ద ఎన్నికల రోజు. అలాగే ఉత్తర ప్రదేశ్, బీహార్, పంజాబ్‌లో కూడా పోలింగ్ జరుగుతుంది. దీంతో ఢిల్లీ వెళ్లడం ఆచరణాత్మకం కాదు' అని టీఎంసీ నేత అన్నారు.

కాగా, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఆ రాష్ట్రంలో మాత్రం 'ఇండియా' బ్లాక్‌తో పొత్తుకు దూరంగా ఉంది. అయితే ఈ కూటమిలో తాము భాగమని మమతా బెనర్జీ తెలిపారు. ఢిల్లీ స్థాయిలో మాత్రమే 'ఇండియా' బ్లాక్‌కు మద్దతిస్తామని స్పష్టం చేశారు.

# జూన్ 4న జరిగేది ఇదే.. : అమిత్ షా జోస్యం

న్యూఢిల్లీ, మే 27 : లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కార్ వరుసగా మూడోసారి కొలువుతీరుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. వారణాసిలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

జూన్ 4న ఎన్నికల ఫలితాలు రానున్నాయని, ప్రధాని మోదీ 400కుపైగా సీట్లు సాధించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక జూన్ 4 మధ్యాహ్నం రాహుల్ గాంధీ విలేకరుల సమావేశం నిర్వహించి ఈవీఎంల కారణంగానే తాము ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని చెబుతారని ఆయన అంచనా వేశారు.

కాంగ్రెస్ సారధ్యంలోని విపక్ష ఇండియా కూటమికి ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని అమిత్ షా పేర్కొన్నారు. ఓటమి పాలవడంతో దిక్కుతోచని స్థితిలో విపక్ష కూటమి ఎప్పటిలానే ఈవీఎంలపై నిందలు మోపుతుందని దుయ్యబట్టారు.

# 2025 నాటికి అందుబాటులోకి ఎక్స్ఏఐ సూపర్‌కంప్యూటర్ : ఎలన్ మస్క్ కసరత్తు

న్యూఢిల్లీ, మే 27 : టెస్లా, స్పేస్ఎక్స్, ఎక్స్ వంటి కంపెనీల వెనకున్న మాస్టర్ మైండ్ ఎలన్ మస్క్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ ఎక్స్ఏఐను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లడంపై కసరత్తు వేగవంతం చేశారు. తన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ కోసం 2025 నాటికి సూపర్‌కంప్యూటర్‌ను క్రియేట్ చేయాలని మస్క్ యోచిస్తున్నారు.

సూపర్‌కంప్యూటర్ ఆవిష్కరణ దిశగా కార్యాచరణతో ముందుకెళతామని ఎలన్ మస్క్ ఇటీవల ఇన్వెస్టర్లతో వెల్లడించినట్టు ది ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ తెలిపింది. ఈ అడ్వాన్స్‌డ్ మెషీన్ 2025 నాటికి పనిచేసేలా సూపర్‌కంప్యూటర్ తయారీ ప్రణాళికలతో మస్క్ ముందుకెళుతున్నారు.

భవిష్యత్ ఏఐ మోడల్స్ కోసం జీపీయూ వాడకాన్ని విస్తృతం చేసేందుకు మస్క్ ప్రణాళికలు రూపొందించారు.

ఈ సూపర్‌కంప్యూటర్ ఒరాకిల్ భాగస్వామ్యంతో ఎన్విడియా హెచ్100 జీపీయూలను వినియోగిస్తుంది. ఈ భారీ సూపర్‌కంప్యూటర్‌ను డెవలప్ చేయడంలో సాయపడేందుకు ఒరాకిల్‌తో భాగస్వామ్యం కోసం ప్రయత్నిస్తున్నామని మస్క్ సంకేతాలు పంపారు.

అయితే దీనిపై ఎక్స్ఏఐ, ఒరాకిల్ తక్షణమే స్పందించలేదు. డేటా సెంటర్లలో ఏఐ సంబంధిత టాస్క్ కోసం ఈ చిప్స్‌కు భారీ డిమాండ్ నెలకొనడంతో తన సూపర్ కంప్యూటర్ ప్రాజెక్ట్ కోసం ఈ టెక్నాలజీకి మస్క్ మొగ్గుచూపుతున్నాడని చెబుతున్నారు.

# జూన్ 14 తర్వాత ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు.. తేల్చి చెప్పిన ఉడాయ్..!

న్యూఢిల్లీ, మే 27 :జూన్ 14 లోపు వ్యక్తిగత డిటైల్స్ అప్ డేట్ చేయకుంటే ఆధార్ కార్డు పని చేయదంటూ చక్కర్లు కొడుతున్న వదంతులను భారత్ విశిష్ట ప్రాధికార సంస్థ (ఉడాయ్) తోసిపుచ్చింది. కేవలం ఉచితంగా ఆధార్ వివరాలు అప్ డేట్ చేయడానికి మాత్రమే వచ్చే నెల 14 తుది గడువని ఉడాయ్ తేల్చి చెప్పింది. జూన్ 14 తర్వాత కూడ ఆధార్ వివరాల సవరణకు అవకాశం ఉంటుందని, ఆధార్ నమోదు కేంద్రాలకెళ్లి నిర్దేశిత ఫీజు చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. ఇంతకు ముందు గతేడాది (2023) డిసెంబర్ 14 వరకూ ఉచితంగా ఆధార్ వివరాల అప్ డేట్ కోసం ఉడాయ్ గడువు విధించింది. తర్వాత రెండు సార్లు వచ్చే నెల 14 వరకూ పొడిగించింది. ఆ లోపు ఆన్ లైన్‌లో తగిన పత్రాలు సమర్పించి ఉచితంగా ఆధార్ డిటైల్స్ అప్ డేట్ చేసుకోవచ్చు.ఆధార్ లో పేరు నమోదు చేసుకున్న పదేండ్లకోసారి తమ వివరాలు అప్ డేట్ చేసుకోవాలని గతంలోనే పౌరులకు ఉడాయ్ సూచించింది. ఇందుకు గుర్తింపు కార్డు, చిరునామా ధృవీకరణ పత్రాలు సమర్పించి, సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ (సీఐడీఆర్)లో వివరాలు అప్ డేట్ చేసకోవాలని ఉడాయ్ తెలిపింది. దీనివల్ల పౌరుల సమాచారం ఎప్పటికప్పుడు సీఐడీఆర్‌లో అప్ డేట్ కావడంతో ఖచ్చితమైన సమాచారం నిక్షిప్తం అయ్యేందుకు దోహద పడుతుందని వివరించింది .పౌరులు ఉడాయ్ వెబ్ సైట్ లోకి లాగ్ఇన్ అయి తాజా గుర్తింపు కార్డు, చిరునామా వివరాలు సబ్మిట్ చేయాలి. గుర్తింపు కార్డు, చిరునామాకు రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, కిసాన్ పాస్ బుక్, పాస్ పోర్ట్ వంటివి వాడొచ్చు. టీసీ, మార్కుల జాబితా, పాన్/ఈ-పాన్, డ్రైవింగ్ లైసెన్స్ గుర్తింపు ధృవీకరణ పత్రంగా, మూడు నెలలు మించని విద్యుత్, నీరు, గ్యాస్, టెలిఫోన్ బిల్లులను చిరునామా ధృవీకరణ పత్రంగా వాడొచ్చునని ఉడాయ్ వెల్లడించింది. ధృవీకరణ పత్రాలను స్కాన్ చేసి 'మై ఆధార్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

# ఏపీలో నెరవేరనున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కల : మాజీ మంత్రి కొణతాల

అమరావతి, మే 27 :సదాశయంతో కూటమిని ఏకం చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కల త్వరలో నెరవేరబోతుందని మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఆశించిన ఫలితాలు రాబోతుందని అన్నారు. చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోబోతున్నామని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ మొదలు పెట్టిన ప్రాజెక్టులను కనీసం కొడుకుగా వైఎస్ జగన్ పూర్తి చేయలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. పోలవరం పెండింగ్ లోనే ఉంది. నిర్వాసితులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పెండింగ్‌లో ఉండడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఎక్కువగా వలసలున్నాయని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఎకరాకు నీరు రావాలని అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యధిక ప్రాధాన్యత ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఇవ్వాలని కోరబోతున్నామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజన సమయంలో కంటే వైఎస్ జగన్ పాలనలో వంద రేట్లు నష్టపోయామని కొణతాల ఆరోపించారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

ఆహ్వానం



మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక

### బాల సాహిత్య సమ్మేళనం

2024 మే 29, 30 తేదీల్లో

వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణం
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్

**మొదటి సదస్సు**
మధ్యాహ్నం 2 గంటలకు
**'బడిలో తెలుగు భాష' చర్చా గోష్ఠి**

విశిష్ట అతిథి
**డా. దాసరి వెంకట రమణ**
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత

అధ్యక్షులు
**డా. వి.ఆర్. శర్మ** ప్రముఖ బాలసాహితీవేత్త

పాల్గొనే ప్రముఖులు

| | | |
|---|---|---|
| శ్రీ బద్రి కూర్మారావు | శ్రీ కూకట్ల తిరుపతి | శ్రీ సయ్యద్ షఫీ |
| డా. చిట్యాల దేవేంద్రప్ప | శ్రీ గోపగాని రవీందర్ | శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్ |
| శ్రీ పుల్లా రామాంజనేయులు | శ్రీమతి త్రిపురారి పద్మ | శ్రీ అక్షరం ప్రభాకర్ |
| డా. శారదా హన్మాండ్లు | శ్రీమతి జి. శ్రీమతి | శ్రీ అరుణ బట్టువార్ |
| డా. తూర్పింటి నరేష్ కుమార్ | శ్రీ శీలం భద్రయ్య | శ్రీ కొండూరు పోతన |
| శ్రీమతి బాలబోయిన రమాదేవి | శ్రీ గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ | |

సమన్వయ కర్త : **డా. ఉప్పల పద్మ** అధ్యాపకులు,రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి

సాయంత్రం 4 గంటలకు
**రెండవ సదస్సు**
**"పత్రికలు - బాలసాహిత్యం' చర్చా గోష్ఠి**

అధ్యక్షులు : **శ్రీ బైస దేవదాసు** 'నేటి నిజం' సంపాదకులు
విశిష్ట అతిథి : **శ్రీ మణికొండ వేదకుమార్** 'బాల చెలిమి' సంపాదకులు

పాల్గొనే బాలల పత్రిక సంపాదకులు, పత్రికా రచయితలు

| | |
|---|---|
| శ్రీ టి. వేదాంత సూరి (మొలక) | శ్రీ పొత్తూరి సుబ్బారావు (సాహితీ కిరణం) |
| శ్రీ యన్.కె. బాబు (నాని) | డా. నెమిలేటి కిట్టన్న (బాలల నేస్తం) |
| శ్రీ రాజా (చెకుముకి) | శ్రీమతి రత్నమాధవి (గడుగ్గాయి) |
| శ్రీ ప్రభాకర్ (చంపక్) | శ్రీ కంతేటి చంద్రప్రతాప్ |
| డా. బి. మనోహరి (మూసి) | |

సమన్వయకర్త : **శ్రీ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి** ప్రముఖ బాలసాహితీవేత్త

సాయంత్రం 6 గంటలకు
**మూడవ సదస్సు**
**'కథ చెప్పే కళ'**

| అధ్యక్షులు | విశిష్ట అతిథి |
|---|---|
| **శ్రీ చొక్కాపు వెంకటరమణ** కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత | **శ్రీమతి కన్నెగంటి అనసూయ** కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత |

పాల్గొనే కథకులు

| | | |
|---|---|---|
| డా. ఎం. హరికిషన్ | శ్రీమతి మనోజ | శ్రీమతి సమ్మెట ఉమాదేవి |
| శ్రీ ఎన్నవెళ్ళి రాజమౌళి | శ్రీమతి దివ్య | శ్రీ టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం |
| శ్రీ వంగపల్లి పద్మ | శ్రీమతి ఎ. ప్రమీల | శ్రీమతి కృష్ణ చైతన్య |

సమన్వయ కర్త :**శ్రీమతి రమాదేవి కులకర్ణి** ప్రముఖ కవయిత్రి

30వ తేది ఉదయం 10గంటకు
**నాల్గవ సదస్సు**
**"లలిత కళా పరిచయం"**

అధ్యక్షులు : **శాంతా రావు** బాల వికాసకారులు
విశిష్ట అతిథి : **డా. జి. అమృతలత** విద్యావేత్త, ప్రముఖ రచయిత్రి

ప్రసంగాంశాలు - వక్తలు

సంగీతం - **శ్రీమతి మాడభూషిణి రాజ్యలక్ష్మి** సంగీత విద్వాంసురాలు
నృత్యం - **కోకా విజయలక్ష్మి** ప్రముఖ నర్తకి, నాట్యగురువు
నాటకం - **శ్రీ బిచరాజు శ్రీధర్** ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు
చిత్రలేఖన శిల్పకళ - **శ్రీ జె. వెంకటేశ్వర్లు (జెవి)** ప్రముఖ చిత్రకారులు, జెఎన్టీయూ అధ్యాపకులు
జానపద కళలు - **శ్రీ గజవెల్లి ఈశ్వర్** తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల అధ్యాపకులు

సమన్వయకర్త : **శ్రీ కోకిల నాగరాజు** అధ్యాపకులు, కళాకారులు

మధ్యాహ్నం 12 గంటలకు
**ఐదవ సదస్సు**
**"బాల సాహిత్యం - ప్రమాణాలు"**

అధ్యక్షులు : **శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి** ప్రముఖ బాలసాహితీవేత్త
విశిష్ట అతిథి: **శ్రీమతి మాడభూషి లలితా దేవి** కన్వీనర్, మాడభూషి రంగాచార్య స్మారకట్రస్టు

పాల్గొనే బాలసాహితీవేత్తలు

| | |
|---|---|
| శ్రీ టి.వి. రామకృష్ణ | శ్రీ పుప్పాల కృష్ణమూర్తి |
| డా. గంగిశెట్టి శివకుమార్ | డా. బి.వి.ఎన్. స్వామి |
| డా. కందేపి రాణి ప్రసాద్ | శ్రీ పైడిమర్రి రామకృష్ణ |
| డా. సిరి | శ్రీ మాచిరాజు కామేశ్వరరావు |
| డా. సాగర్ల సత్తయ్య | శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి |
| శ్రీ ఉండ్రాళ్ళ రాజేశం | శ్రీ కొత్తపల్లి సురేశ్ |

సమన్వయకర్త : **డా. అమరవాది నీరజ** బాల సాహితీవేత్త

భోజన విరామం

**ఆరో సదస్సు**
మధ్యాహ్నం 2.30 గంటలకు
**"బాల సాహిత్యం - గ్రంథాలయాలు"**

అధ్యక్షులు : **శ్రీ సి.ఎ. ప్రసాద్** బాల సాహితీవేత్త
విశిష్ట అతిథి : **శ్రీ శీల అవిలేను** స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు

పాల్గొనే బాల సాహితీవేత్తలు, గ్రంథాలయ నిర్వాహకులు

| | |
|---|---|
| డా. వాసరవేణి పర్శరాములు | శ్రీ కిలపర్తి దాలినాయుడు |
| శ్రీ డి. ప్రవీణ్ శర్మ | శ్రీ కూచిమంచి నాగేంద్ర |
| శ్రీ కందుకూరి భాస్కర్ | శ్రీ పోరెడ్డి అశోక్ |
| శ్రీ రాచర్ల రమేష్ | శ్రీ మెందు మహేశ్వర్ |
| శ్రీ ఎస్. వెంకటనారాయణ | శ్రీమతి గద్వాల కిరణ్ కుమారి |
| శ్రీమతి సబ్బని సుమిత్రాదేవి | శ్రీ దుర్గం బైతి |

సమన్వయం : **డా. కాసర్ల నరేష్ రావు** బాల సాహితీవేత్త, రచయిత

సాయంత్రం 4.30 గంటలకు
**సమాపనోత్సవం**

అధ్యక్షులు
**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

ముఖ్య అతిథి
**శ్రీమతి ఎం. రాధారెడ్డి**
డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి.)

విశిష్ట అతిథి
**శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి**
సంయుక్త సంచాలకులు, మోడల్ స్కూల్స్, తెలంగాణ ప్రభుత్వం

గౌరవ అతిథి
**డా. పత్తిపాక మోహన్**
దక్షిణప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం

ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

**డా. జె. చెన్నయ్య**
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

5 / 7

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.